RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 70 | శనివారం, ఏప్రిల్ 13, 2024 | పేజీలు : 4

## మూడు ప్రైవేట్ ఆసుపత్రుల ప్రసూతి గదులు సీజ్

**సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3 ప్రైవేట్ నర్సింగ్ హోమ్ల ప్రసూతి గదులను కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుమన్ మోహన్ రావు గురువారం తెలిపారు. 2023-24లో 100% సిజేరియన్ ఆపరేషన్ల ద్వారా మాత్రమే ప్రసవాలు చేసిన వేములవాడలోని అమృత నర్సింగ్ హోమ్, వాసుదేవ ఆసుపత్రి, సిరిసిల్లలోని సరయు ఆసుపత్రిలోని ప్రసూతి గదులను సీజ్ చేసి వారికి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

### రాజ్యాంగాన్ని రద్దు చేయడం అంబేద్కర్‌కూ...

# సాధ్యం కాదు

రాజస్థాన్: భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. రాజ్యాంగాన్ని తమ ప్రభుత్వం గౌరవిస్తోందని ఆయన తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దు చేయ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు కూడా సాధ్యం కాదని ఆయన ప్రకటించారు. రాజస్థాన్‌లోని బార్మర్‌లో శుక్రవారం ఒక ఎన్నికల ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ తన ప్రభుత్వానికి రాజ్యాంగమే సర్వస్వమని వెల్లడించారు. బాబాసాహెబ్ అంబేద్కరే స్వయంగా వచ్చినా ఇప్పుడు రాజ్యాంగాన్ని రద్దు చేయడం ఆయనకు సాధ్యం కాదని మోడీ స్పష్టం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో బిజెపి ప్రభుత్వం మూడోసారి గెలిస్తే దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడతాయంటూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌పై ప్రధాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని, ఇప్పుడు మోడీని తిట్టడానికి రాజ్యాంగం పేరును కాంగ్రెస్ వాడుకుంటోందని ప్రధాని ఆరోపించారు. అంబేద్కర్‌కు భారత రత్న పురస్కారం దక్కకుండా అడ్డుపడింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన ఆరోపించారు. అంబేద్కర్ బతికుండగా ఎన్నికలలో ఆయనను ఓడించిన




కాంగ్రెస ఆయనకు భారత రత్న రాకుండా అడ్డుపడడంతోపాటు దేశంలో ఎమర్జెన్సీని విధించి రాజ్యాంగాన్ని అంతం చేయడానికి ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు మోడీని దూషించడానికి రాజ్యాంగం పేరుతో అసత్యాలకు పాల్పడుతోందని ఆయన కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు.

### ఎమ్మెల్సీ కవితకు మూడు రోజుల...

# సీబీఐ కస్టడీ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మూడు రోజుల పాటు సీబీఐ కస్టడీ విధిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుతో ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆమె సీబీఐ కస్టడీలో ఉండనున్నారు. ఏప్రిల్ 15న ఉదయం 10 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపరచాలని ఢిల్లీ కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరగా.. కేవలం మూడు రోజుల కస్టడీకి మాత్రమే కోర్టు అనుమతించింది. దీంతో కవితను రౌజ్ అవెన్యూ కోర్టు నుంచి సీబీఐ ప్రధాన



కార్యాలయానికి అధికారులు తరలించనున్నారు. నేటి నుంచే మూడు రోజుల పాటు కవితను సీబీఐ విచారించనుంది.





## లోక్ సభ ఎన్నికల ప్రచారానికి కదిలిన...

# మజ్లీస్ దండు!

హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల ప్రచారానికి మజ్లీస్ పార్టీ శుక్రవారం నుంచి పూనుకుంది. హైదరాబాద్ సీటుకు ఏడు నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో ప్రచారానికి మజ్లీస్ పార్టీ నడుము బిగించింది. హైదరాబాద్ లోక్ సభ సీటు కోసం పాదయాత్ర(పైదల్ దౌరా)ను మజ్లీస్ నాయకులు చేపట్టబోతున్నారు. హైదరాబాద్ ఎంపీ సీటుకు ఆల్ ఇండియా మజ్లీస్-ఈ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఏఐఎంఐఎం) అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పోటీ పడుతున్నారు. హైదరాబాద్ లో 40 ఏళ్లుగా మజ్లీస్ తిరుగులేని పార్టీగా ఉంది. మజ్లీస్ పార్టీ 1984 నుంచి హైదరాబాద్ సీటు గెలుస్తూ వస్తోంది. 2019లో అసదుద్దీన్ ఓవైసీ 5లక్షలకు పైగా ఓట్ల తేడాతో గెలుపొందారు.

## బిజెపికి ఓమర్ అబ్దుల్లా సవాల్

శ్రీనగర్: సత్తా ఉంటే కశ్మీరు లోయలోని లోక్‌సభ స్థానాల నుంచి సొంతంగా పోటీ చేయాలని



నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) జాతీయ అధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లా శుక్రవారం బిజెపికి సవాలు విసిరారు. బిజెపి అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు కాకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన సవాలు చేశారు. అభివృద్ధి, శాంతి మంత్రం జపిసుట్తన్న బిజెపి కశ్మీరు లోయలోని మూడు లోక్‌సభ స్థానాలకు తన అభ్యర్థులను నిలబెట్టాలని శుక్రవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన డిమాండు చేశారు.

### వొక్కలిగ కులస్తులను...

# రెచ్చగొడుతున్నారు


బెంగళూరు: వొక్కలిగ ముఖ్యమంత్రిని పదవీచ్యుతుడిని చేయడంలో బిజెపి పాత్రపై కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుఅర్ చేసిన ఆరోపణలను కర్నాటక బిజెపి శుక్రవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తమపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారని ఇసికి బిజెపి ఫిర్యాదు చేసింది. వొక్కలిగ ముఖ్యమంత్రి అని డికె శివకుమార్ ప్రస్తావించింది హెచ్‌డి కుమారస్వామిని. 2019లో కుమారస్వామి సారథ్యంలోని జెడిఎస్-కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కర్నాటకలో వొక్కలిగ కులస్తులు మంచి పలుకుబడి, ప్రాబల్యమున్న వ్యవసాయ వర్గానికి చెందినవారు. శివకుమార్ వ్యాఖ్యల వల్ల వొక్కలిగ వర్గానికి చెందిన సభ్యులకు, లక్షలాది మంది అదదిచుంచనగిరి స్వామీజీ అనుచరులకు మధ్య విభేదాలు సృష్టించగలవని బిజెపి తన ఫిర్యాదులో పేర్కొంది. వొక్కలిగ కులం వారు కాని ఆదిచుంచనగిరి స్వామీజీ కాని అమాయకులు కాదని, వొక్కలిగ ముఖ్యమంత్రి(కుమారస్వామి)ని దించడంలో బిజెపి నాయకులైన ఎహెచ్ విశ్వనాథ్, నారాయణ గౌడ, ఆర్ అశోక, అశ్వథ్ నారాయణ్, సిపి యోగేశ్వర, బిఎస్ ఎడియూరప్ప పాత్రను వారు మరచిపోలేదని శవకుమార్ వ్యాఖ్యానించినట్లు బిజెపి తన ఫిర్యాదులో పేర్కొంది. రాజకీయ నాయకులను విమర్శించడం ద్వారా శివకుమార్ ఎన్నికల నియమావళిని ఉ



ల్లంఘించారని, కుల ప్రాతిపదికన తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలు ముఖ్యంగా వొక్కలిగ వర్గంవారి మనోభావాలను రెచ్చగొడుతున్నారని శివకుమార్‌పై బిజెపి ఫిర్యాదు చేసింది. శివకుమార్ ఆరోపణలు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, ఇసి ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని బిజెపి కోరింది.

# నకిలీ పార్టీలతో చేతులు కలిపిన బిజెపి


ముంబై: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై నేషనలిస్ట కాంగ్రెస్ పార్టీ(శరద్‌చంద్ర పవార్) శుక్రవారం మండిపడింది. బిజెపితో నకిలీ ఎన్‌సిపి, నకిలీ శివసేన చేతులు కలిపాయని ఆ పార్టీ ఆరోపించింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఒక ఎన్నికల సభలో అమిత్ సా ప్రసంగిస్తూ మహా వికాస్ అఘాడిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వీటిని ఖండిస్తూ ఎన్‌సిపి(శరద్‌చంద్ర పవార్) అధికార ప్రతినిధి మహేష్ తాపసే శుక్రవారం ఎదురుదాడి చేశారు.
తమను నకిలీ ఎన్‌సిపి అంటూ చెప్పడానికి అమిత్ షా ఎవరని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంలో నకిలీ నాయకులను బిజెపి చేర్చుకుందని ఆయన విమర్శించారు. మహారాష్ట్రకు



వచ్చి శరద్ పవార్‌ను తిట్టకపోతే మీడియా పట్టించుకోదని తెలిసే అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఎద్దేవా చేశారు. మహారాష్ట్రకే కాక యావద్దేశానికి శరద్ పవార్ చేసిన సేవలు ఏమిటో అమిత్ షాకు తెలియదని ఆయన అన్నారు.

### నేను పిల్లులను, కుక్కలను చంపను..

# సింహాన్నే చంపుతా...



హైదరాబాద్: తాను పిల్లులను, కుక్కలను చంపనని, చంపితే సింహాన్నే చంపుతానని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇండియా టివిలో నిర్వహించే ఫేమస్ టాక్ షో 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం ఢిల్లీకి వెళ్లిన ఆయన ఈ కార్యక్రమంలో పలు విషయాలను పంచుకున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను సిఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. కెసిఆర్ సర్కారు మిమ్మల్ని జైలులో వేసినందుకు రివేంజ్ తీసుకుంటున్నారా అని 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో యాంకర్ రజత్ శర్మ అడిగిన ప్రశ్నకు సిఎం రేవంత్ బదులిస్తూ రివేంజ్ ఇంకా స్టార్టే కాలేదని సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ నేతలు తరచూ అంటున్నారు సింహం లోపల ఉంది, బయటకు వస్తుంది అప్పుడు చూడండి అంటున్నారుగా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించగా, రమ్మనండి పిస్టోల్‌తో రెడీగా ఉన్నాం, ఒక్క తూటాతో అయిపోతుందని సిఎం రేవంత్ ఘాటుగా రిప్లై ఇచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లలో దగా చేస్తే వేటు

హైదరాబాద్ : రైతులు అమ్ముకునే ధాన్యా న్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సి ఎం సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధ రకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్సుల ను రద్దు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సిఎం ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి సిఎం రేవంత్ అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అందుకే ధా న్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని ముఖ్యమంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు. నేరుగా కల్లాల నుంచి వడ్లను మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఒకటి రెం డు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సి ఎం సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ సూచించారు. అన్ని



జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల కు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని సిఎం ఆదేశించారు. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించా లని సిఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఏ రోజుకారోజు రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షించాలని రేవంత్ ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పలు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లలో జరుగుతున్న తీరును పరిశీలించాలని సిఎం సూచించారు.

## సంపాదకీయం

# పార్లమెంట్ లో సాగని ఫలప్రదమైన చర్చ

స్వాతంత్ర భారతంలో ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా భారత పార్లమెంటు నిలుస్తుందని నాడు మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. 1952 నుంచి నేటి వరకు మన దేశం 17 లోక్‌సభల పనితీరును చూడగా, 2024 జూన్ 4 నాటికి 18వ లోక్‌సభ ఏర్పడబోతోంది. ఈ నేపథ్యంలో గడచిన 17వ లోక్‌సభా కాలంలో ఎలా గడిచిందో ఓసారి తెలుసుకునే ప్రయత్నిం చేద్దాం. 17వ లోక్‌సభ చిట్టచివరి సమావేశం జరిగిన రోజు దేశ ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సభా కాలంలో 97% సమయం సద్వినియోగం అయిందనీ, ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన 7 సెషన్లు 100% కంటే ఎక్కువ ఉపయుక్తంగా నడిచాయని చెప్పుకొచ్చారు. ఆయన మాటలను వింటున్నప్పుడు గత 77 ఏడేళ్లలో తమ హయాంలోనే చట్టసభలు సక్రమంగా పనిచేస్తున్నాయనే రవ్వంత అతిశయమూ కనిపించింది. అయితే, తన పాలనా కాలంలో విస్మరించిన కొన్ని ప్రజాస్వామ్య సంప్రదాయలపై ప్రధాని మౌనం వహించారు. 1969 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి ఇచ్చే సంప్రదాయానికి పాతరేస్తూ, అసలు ఎన్నికే జరపకుండా మౌనం వహించారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి ఈ ప్రభుత్వ హయాంలోనే ఇలా జరిగింది.గడచిన ఐదేళ్ల కాలంలో మన లోక్‌సభ ఎంత గొప్పగా పనిచేసిందో తెలుసుకునేందుకు కొన్ని గణాంకాలను పరిశీలిద్దాం. వాజపేయి ప్రధానిగా ఉన్న 1999 ? 2004 మధ్యకాలపు 13వ లోక్‌సభ 423 రోజులు పనిచేసింది. కానీ, 17వ లోక్‌సభ కేవలం 278 రోజుల్లోనే సమావేశమైంది. అంటే 13వ లోక్‌సభ కంటే 17వ లోక్‌సభ సుమారు 34% సమయం తక్కువ పనిచేసింది. 2020 ? 2022 మధ్యకాలంలో లోక్‌సభ సమావేశాలు ఏడు పర్యాయాలు అనుకున్న షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. అంతేగాక.. 2023లో జరిగిన చివరి ప్రత్యేక సెషన్‌తో పాటు శీతాకాల సమావేశాలు కూడా షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. ఇలా షెడ్యూల్ కంటే ముందే సెషన్ ముగిస్తే.. ఆ కోత పెట్టిన రోజుల్లో ఎంపీలు అడగాల్సిన ప్రశ్నలు మిగిలిపోతాయని ప్రభుత్వానికి అనిపించలేదు. ఇక ఆర్డినెన్స్‌ల జారీలోనూ 17వ లోక్‌సభా కాలపు ప్రభుత్వం రికార్డులకెక్కింది. పదేళ్ల యుపిఎ హయాంలో నాటి కేంద్ర ప్రభుత్వం 61 ఆర్డినెన్స్‌లు జారీ చేయగా, 2014 నుండి 2021 మధ్యనే ఏకంగా 76 ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి.2019 నుంచి డిసెంబర్ 21, 2023 నాటికి లోక్‌సభలో 86, రాజ్యసభలో 103 బిల్లులను 2 గంటల కంటే తక్కువ టైంలో చర్చించి పాస్ చేశారు. 2023 వర్షాకాల సమావేశంలో రాజ్యసభ ఫార్మసీ (సవరణ) బిల్లును కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదించి కొత్త రికార్డును సృష్టించింది. ఆ మర్నాడే సెంట్రల్ జీఎస్టి సవరణ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టి సవరణ బిల్లులను మన లోక్‌సభ సరిగ్గా మూడే నిమిషాల్లో ఆమోదించింది. అంతేకాదు.. అసలు ఎజెండాలోని బిల్లులను పక్కనబెట్టి, హటాత్తుగా కొత్తబిల్లులు తీసుకొచ్చి వాటిని నిమిషాల వ్యవధిలో ఆమోదించిన ఘనతా 17వ లోక్‌సభకే దక్కుతుంది. 2009 ? 2014 మధ్యకాలంలో నాటి ప్రభుత్వం 71% బిల్లులను స్టాండింగ్ కమిటీలకు పంపగా, 2019 నుండి కేవలం 16% బిల్లులు మాత్రమే స్టాండింగ్ కమిటీ ముందుకు పరిశీలన కోసం వెళ్లాయి. 2014 ? 2021 మధ్యకాలంలో మన పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లులలో 74 బిల్లులు (24.5%) బిల్లులు మాత్రమే సంప్రదింపుల కోసం సర్క్యులేట్ చేశారు. అయితే, ఈ 74 బిల్లులలో కనీసం 40 బిల్లులను విపక్షం పరిశీలించేందుకు ఇవ్వాల్సిన నెలరోజుల వ్యవధిని ఈ ప్రభుత్వం కుదించివేసింది. సమాజాన్ని బాగా ప్రభావితం చేసే, దేశ, సమాజపు తక్షణ ప్రాధాన్యమున్న అంశాలపై చర్చించాలని రూల్ నంబరు 267 కింద విపక్ష సభ్యులు అనేకసార్లు లేవనెత్తినా వారికి మాట్లాడే అవకాశం రాలేదు. లోక్‌సభలో సభానాయకుడిగా ఉన్న ప్రధాని మోదీ 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం' మీద తప్ప ఈ ఐదేళ్ల కాలంలో కీలకమైన ఏ అంశంమీదనైనా సభలో నిలబడి సభ్యుల అనుమానాలు దూరంచేయలేకపోయారు.మరీ ముఖ్యంగా కీలకమైన 3 క్రిమినల్ బిల్లుల విషయంలో హోం వ్యవహారాల కమిటీ ప్రజల నుండి ఎలాంటి సలహాలను గానీ సూచనలను గానీ ఆహ్వానించలేదు. ఈ క్రిమినల్ బిల్లుల విషయంలో సర్కారు ఆత్రుత, నాటకీయత ఎంతగా కనిపించిందంటే.. ఈ బిల్లుల మీద అభిప్రాయాలు చెప్పే అవకాశం ప్రభుత్వం నిర్ణయించిన వ్యక్తులకు మాత్రమే దక్కింది. ఇదేంటని నిలదీసిన విపక్షానికి సర్కారు మౌనమే సమాధానమైంది. ఇక 2014 నుంచి చివరి సెషన్ వరకు కేవలం ఐదంటే ఐదు బిల్లులే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీల ముందుకు వెళ్లాయి. 2016- 2023 మధ్యకాలంలో వచ్చిన బడ్జెట్ సమావేశాల్లో 79% సెషన్స్‌లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదాలు జరిగిపోయాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఆయా శాఖలు తమ శాఖ కేటాయింపులను లోతుగా పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 40 రోజుల సమయం ఇచ్చేవారు. 2016 నుంచి అది సగానికి కుదించబడింది. ఈ గణాంకాలను బట్టి ఈ ప్రభుత్వానికి చర్చల మీద, సంప్రదింపుల మీద ఎంత నమ్మకం ఉన్నాయో అర్థమవుతుంది.

# రామేశ్వరం కేఫ్ పేలుడు సూత్రధారి, పాత్రధారి అరెస్ట్




న్యూఢిల్లీ: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ బాంబు పేలుడు కేసులో సూత్రధారితోసహా ఇద్దరు నిందితులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) శుక్రవారం అరెస్టు చేసింది. బాంబు పేలుడు ప్రధాన సూత్రధారి అబ్దుల్ మథీన్ అహ్మద్ తాహాతోపాటు బాంబును అమర్చిన ముసావీర్ హుస్సేన్ సాజీబ్‌ను ఎన్ఐఎ బృందం కోల్‌కతా సమీపంలో అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. రామేశ్వరం కేఫ్‌లో ఐఇడిని షాజీబ్ అమర్చగా పేలుడుకు పథక రచన చేసింది తాహా అని అధికారులు తెలిపారు. నకిలీ పేర్లతో కోల్‌కతా సమీపంలోని స్థావరంలో తలదాచుకున్న ఎన్ఐఎ అధికారుల బృందం ఏప్రిల్ 12 తెల్లవారుజామున అరెస్టు చేసిందని వారు చెప్పారు. ఎన్ఐఎ, కేంద్ర నిఘా సంస్థలు, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్నాటక, కేరళ రాష్ట్ర పోలీసులు సమన్వయంతో నిందితుల కోసం వేట సాగించి పట్టుకోగలిగారని అధికారులు చెప్పారు. ఈ ఇద్దరు నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రూ. 10 లక్షల చొప్పున నగదు బహుమానాన్ని కూడా ఎన్ఐఎ గత నెల ప్రకటించింది. బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లగల రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1వ తేదీన ఐఇడి పేలుడు సంభవించింది. తొలుత ఈ కేసు దర్యాప్తును బెంగళూరు పోలీసులు చేపట్టగా అనంతరం మార్చి 3న ఎన్ఐఎ తీసుకుంది.

# ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు బిజెపి కుట్ర




న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించడానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఢిల్లీ క్యాబినెట్ మంత్రి అతిషి శుక్రవారం ఆరోపించారు. ఆప్ ప్రభుత్వాన్ని కూల్చడానికి జరిగిన రాజకీయ కుట్రే ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టని విలేకరుల సమావేశంలో ఆమె ఆరోపించారు. ఢిల్లీలో త్వరలో రాష్ట్రపతి పాలన విధించనున్నట్లు తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందని ఆమె చెప్పారు. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించిన చట్టవిరుద్ధమేగాక ప్రజా తీర్పునకు వ్యతిరేకమని ఆమె తెలిపారు. దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉందని సూచించే పరిణామాలు ఇటీవలి కాలంలో చాలా జరిగాయని అతిషి తెలిపారు. గత కొద్ది నెలలుగా సీనియర్ ఐఎఎస్ అధికారి ఎవరినీ ఢిల్లీలో నియమించలేదని ఆమె తెలిపారు. వివిధ శాఖలలో అనేక ఖాళీలు నెలల తరబడి భర్తీ కావడం లేదని, ఎన్నికల నియమావళి పేరుతో మంత్రుల సమావేశాలకు అధికారులు హాజరు కావడం లేదని ఆమె చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వ నిర్వహణపై కేంద్ర హోం శాఖకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ లేఖలు రాస్తున్నారని ఆమె చెప్పారు.

# వరంగల్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మారేపల్లి సుధీర్ కుమార్



హైదరాబాద్ : వరంగల్ బిఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థిగా హన్మకొండ జిల్లా పరిషత్ ఛైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ పేరును పార్టీ అధినేత కెసిఆర్ ప్రకటించారు. హన్మకొండ జిల్లా వాసి, మాదిగ సామాజికవర్గానికి చెందిన సుధీర్ కుమార్ హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా ఉన్నారు. పార్టీకి విధేయుడిగా, అధినేతతో కలిసి పని చేస్తున్న సుధీర్ కుమార్ సరైన అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నేతలతో చర్చించి వారి సలహాలు, సూచనల మేరకు సుధీర్ కుమార్ అభ్యర్థిత్వాన్ని కెసిఆర్ ఖరారు చేసి ప్రకటించారు. కడియం కావ్య పోటీ నుంచి తప్పుకోవడంతో బిఆర్ఎస్ మరో అభ్యర్థిని ఖరారు చేయాల్సి వచ్చింది. సుధీర్ కుమార్‌తో పాటు పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య పేరు కూడా చర్చకు వచ్చింది. శుక్రవారం వరంగల్ జిల్లా బిఆర్ఎస్ నేతలతో సమావేశమైన కెసిఆర్, అందరితో చర్చించి వరంగల్ లోక్‌సభ స్థానానికి పార్టీ అభ్యర్థిగా సుధీర్ కుమార్ పేరును ప్రకటించారు.

# స్పేస్‌లోకి వెళ్లే మొదటి భారతీయ పౌరుడితడే



న్యూయార్క్ : తొట్టతొలి తెలుగుతేజం అంతరిక్షానికి సాగనుంది. తెలుగువాడైన గోపిచంద్ తోటకూర త్వరలో జరిగే అమెజాన్ న్యూ షెపార్డ్ అంతరిక్ష యాత్రలోని ఆరుగురు సభ్యుల బృందంలో ఒకరిగా ఎంపిక అయ్యారు. త్వరలోనే ఈ ప్రయోగం జరుగుతుంది. ప్రఖ్యాత వ్యాపారవేత్త జెఫ్ బెజో స్థాపిత స్పేస్ కంపెనీ బ్లూ ఒరిజిన్ ద్వారా సాగే అంతరిక్ష ప్రయాణానికి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్యోమగాములను ఎంపిక చేశారు. వీరిలో ఒకరుగా తెలుగు యువకుడు గోపిచంద్‌ను కూడా బృందంలో ఒకరిగా ఖరారు చేశారు.

ఈ కంపెనీ అంతరిక్ష యాత్ర తేదీలను ఇంకా వెల్లడించలేదు. అయితే వ్యోమగాములకు అవసరం అయిన శిక్షణను ఇప్పటికే అందిస్తున్నారు. ఈ తెలుగువాడు ఇప్పుడు అమెరికాలో ఉంటున్నాడు. ఈ యాత్ర పూర్తి అయితే ఇక అంతరిక్షంలో ప్రయాణించే తొలి భారతీయ వ్యోమగామి ఘనత గోపీచంద్‌దే అవుతుంది. కాగా అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయ పౌరుడు కూడా ఆయనే అవుతారు.

1984లో వింగ్ కమాండర్ రాకేష్ శర్మ తరువాత రాజాచారి, శిరీష బండ్ల, సునీత విలియమ్స్, కల్పనా చావ్లాలు భారతీయ సంతతికి చెందిన వారే వీరు కూడా వ్యోమగాములుగా వెళ్లారు. అయితే వీరంతా అమెరికా పౌరులు . భారతీయ పౌరుడు, వ్యోమగామి ఘనత ఈ తోటకూరిదే అయింది. ఇప్పటికైతే ఈ బ్లూ ఒరిజన్ వారి అంతరిక్ష నౌక ఎన్ఎస్ 25 సబ్‌ఆర్బిటల్ మిషన్ తేదీలు ఖరారు కాలేదు. అయితే వచ్చే కొద్ది వారాలలో దీనిని చేపట్టేందుకు విస్తృత స్థాయిలో సన్నాహాలు చేపట్టారు.

**తోటకూర గోపీచంద్ విజయవాడ జన్మస్థలం**

**30వ ఏట అంతరిక్ష ఘనత దక్కిన సాహసి**

30 సంవత్సరాల గోపీ విజయవాడలో జన్మించారు. అతి చిన్న వయస్సులోనే రోదసీకి వెళ్లే లక్కు కొట్టేశాడు. అమెరికాలో ఉంటున్నప్పటికీ ఆయన తన భారతీయ పౌరసత్వ పాస్‌పోర్టు కొనసాగిస్తున్నారు. ఆయన ఎంబ్రీ రిడ్లె ఎరోనాటికల్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేట్ అని బ్లూ ఒరిజన్ ఓ ట్వీట్‌లో తెలిపింది. ఆయన సాహసి, జీవితాంత ప్రయాణ సాహస విన్యాసి, ఇటీవలే ఆయన మౌంట్ కిలిమంజరో శిఖరానికి చేరుకుని సాహస వీరుడు అన్పించుకున్నాడని, ఇప్పుడీ అరుదైన అవకాశం పొందాడని కంపెనీ వర్గాలు స్పందించాయి.

# హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

హైదరాబాద్: బార్ అండ్ రెస్టారెంట్‌లోని పార్కింగ్‌లో గొడవపడి హత్యాయత్నం చేసిన ఇద్దరు యువకులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్, బార్కాస్‌కు చెందిన షేక్ సాజిద్ అలియాస్ సాజిద్ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు, భవానీ నగర్‌కు చెందిన షేక్ అమీర్ అలియాస్ అమ్మూ అలియాస్ ఎటిఎం ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

ఇద్దరు నిందితులు పాతబస్తీకి చెందిన వారు, ఇద్దరిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. షేక్ సాజిద్‌పై బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. షేక్ అమ్మూపై మూడు కేసులు ఉన్నాయి. ఈ నెల 9వ తేదీన ఇద్దరు నిందితులను కలిసి మొఘల్‌పుర, నాగులచింత ఎక్స్ రోడ్డులోని వై5 బార్ అండ్ రెస్టారెంట్‌కు మద్యం తాగేందుకు వెళ్లారు. అదే బార్‌లో పవన్ రూప్‌నర్ మద్యం తాగి పార్కింగ్‌లో ఉన్న వాహనం వద్దకు వచ్చాడు. అక్కడికి వచ్చిన ఇద్దరు నిందితులు పవన్‌తో వాగ్వాదానికి దిగారు.

వెంటనే కత్తితో ఇద్దరు కలిసి పవన్‌పై దాడికి దిగడంతో గాయాలయ్యాయి. దాడి చేస్తుండగా అక్కడికి వచ్చిన బార్‌లో పనిచేస్తున్న సాయిప్రసాద్ నిందితుల బారి నుంచి పవన్‌ను రక్షించేందుకు యత్నించడంతో అతడిపై కూడా దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు. దాడి చేసిన తర్వాత నిందితులు పరారయ్యారు. ఇన్స్‌స్పెక్టర్ షేక్‌జాకీర్ హుస్సేన్, ఎస్సైలు నర్సింహులు, ఆంజనేయులు, నవీన్ కలిసి పట్టుకున్నారు. కేసు దర్యాప్తు కోసం మొఘల్‌పుర పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చీకటి రోజు

1919, ఏప్రిల్ 13 భారత దేశ చరిత్రలో దుర్దినం. బ్రిటిష్ పాలకుల దమనకాండకు పరాకాష్ఠగా, చరిత్ర సాక్ష్యంగా నిలిచిన చీకటి దినం. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అత్యంత దురదృష్టమైన, హేయమైన సంఘటన జలియన్ వాలాబాగ్ ఉదంతం. నాటి బ్రిటిష్ పాలకుల చర్యలకు వందలాది మంది అమాయకులు ప్రాణా లు కోల్పోయిన నేపథ్యం. శతాబ్ద కాలం గడిచినా చెరగని నెత్తుటి మరకల జ్ఞాపకం. పంజాబ్, బెంగాల్‌లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం. భారత ప్రజల్లో నానాటికీ రగులుతున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్‌లో) మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తియైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణచివేయడానికి వైస్రాయ్‌లకు విశేష అధికారాలను కట్టబెట్టారు. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ లో గల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోట లో దాదాపు 20 వేల మంది ప్రజలు సమావేశమైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశమవడానికి ముఖ్యకారణం, ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను అక్రమంగా నిర్బంధించడాన్ని, వారికి ప్రాంత బహిష్కరణ శిక్ష విధించడానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సార్వజనీన సమావేశం. వివిధ విభాగాలకు చెందిన 90 మంది సైనికులు (ఇండియన్ ఆర్మీ), వారితో బాటు రెండు ఆయుధాలతో కూడిన సురక్షిత వాహనాలు అక్కడికి వచ్చాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేకపోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలా వాటికి తాళాలు వేసి ఉన్నాయి. ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాల పాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేకపోయాయి. కాల్పుల కారణంగా వందల మంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000కి పైగా మరణిం చారు. 2000 మందికి పైగా గాయపడ్డారు. అక్కడ స్మారక చిహ్నం పైన రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. వేల మంది సామాన్య పౌరులు సమావేశమై ఉండగా పోలీసులతో చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేలమంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. తన ఆఫీసులో బ్రిగేడియర్ జనరల్ రెజినాల్ డయ్యర్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం అతనికి తిరుగుబాటు విప్లవకారుల సేన ఎదురైనందున కాల్పులు జరుపవలసి వచ్చింది. డయ్యర్‌కు పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైకేల్ ఓడ్వయర్ ఇచ్చిన టెలిగ్రామ్‌లో 'నీ చర్య సరైనదే. దానిని లెఫ్టినెంట్ గవర్నర్ సమర్థిస్తున్నాడు' అని రాసి ఉంది. ఈ ఉదంతంపై విచారణ జరప డానికి 1919లో 'హంటర్ కమిషన్' ఏర్పరచారు.

ఆ కమిషన్ సమక్షంలో డయ్యర్ %--% తనకు ఆ మీటింగ్ గురించి 12:40కి తెలిసిందనీ, దానిని ఆపడానికి తానే విధమైన ప్రయత్నమూ చేయలేదనీ, అక్కడ సమావేశమైన గుంపు గనుక కనిపిస్తే కాల్పులు జరపాలనే ఉద్దేశంతోనే తాను అక్కడికి వెళ్ళాననీ %--% చెప్పాడు. బహుశా కాల్పులు జరుపకుండా గుంపును చెదరగొట్టడం సాధ్యం అయ్యుండవచ్చునని నేను భావిస్తున్నాను. కాని వాళ్ళంతా మళ్ళీ తిరిగి వచ్చి నన్ను అవహేళన చేసేవారు. నేను చేతగాని వాడినయ్యుండేవాడిని' అని -హంటర్ కమిషన్ సమక్షంలో డయ్యర్ పేర్కొన్నాడు. అంతేగాకుండా ఆ స్థలంలోనికి వాహనాలు వెళ్ళగలిగితే తాను మెషిన్ గన్లతో కాల్పులు జరిపించి ఉండేవాడినని, కాని ఇరుకైన సందులలోకి సాయుధ వాహనాలు వెళ్ళడం కుదరలేదని చెప్పాడు. జనం చెల్లాచెదురైనా గాని కాల్పులు ఆపలేదని, కొద్ది పాటి కాల్పుల వల్ల ప్రయోజనం లేదని, జనం అంతా వెళ్ళిపోయే దాకా కాల్పులు జరపడం తన బాధ్యత అని చెప్పాడు.

గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించడం తన బాధ్యత కాదు గనుక అలాంటి ప్రయత్నమేమీ చేయలేదని, ఆసుపత్రులు తెరచి ఉన్నందున వారే వెళ్ళవచ్చునని కూడా అన్నాడు. భారత దేశంలో దీనికి ప్రతిగా తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తమ య్యాయి. పంజాబ్‌లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమానికి మరింత ఆజ్యం పోసింది. 1920లో గాంధీజీ ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించడానికి నాంది పలికింది. భగత్ సింగ్ విప్లవకారుడిగా మారడానికి కూడా ఈ సంఘటనే కారణం. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, బ్రిటీష్ ప్రభుత్వం తన కిచ్చిన సర్ బిరుదును ఇంగ్లండు ప్రభువుకు తిరిగి ఇచ్చివేశారు. మొత్తమ్మీద ఈ సంఘటన స్వాతంత్ర్యోద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చి వేగవంతం చేసింది.

# కొప్పుల ఈశ్వర్ వాకింగ్ ప్రచారం



పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ తో కలిసి వాకింగ్ చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు భారత రాష్ట్ర సమితి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్. ఉదయాన్నే కళాశాల మైదానానికి చేరుకున్న అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తో కలిసి వాకర్స్ ఓట్లను అభ్యర్థించారు.

అనంతరం ఓటర్స్ తో కలిసి అల్పాహారాన్ని సేవించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.... పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థులుగా గతంలో మన ఏరియా కు సంబంధించిన వారు ఉండేవారు కాదని, స్థానికుడైన తనకు మద్దతు తెలపాలని కోరుతున్నామని అన్నారు. గతంలో సింగరేణి నాయకుడిగా మంత్రిగా ఈ ప్రాంతంలో సేవ చేసే అవకాశం కలిగించారాని, ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా భారత రాష్ట్ర తరపున పోటీ చేయడం జరుగుతుందని, తనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని ఫోటోలను అభ్యర్థించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు వాకర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

గరుడ వార్త



## కాసులు కురిపిస్తున్న పెనాల్టీలు

**ముంబై:** దూర ప్రయాణం చేయాలంటే చాలామంది నేటికీ రైళ్లకే ఓటు వేస్తారు. రైల్వే శాఖ కూడా అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చింది కాబట్టి చాలామంది అందులోనే వెళ్ళడానికి సుముఖత వ్యక్తం చేస్తారు. ఇక ఇటీవల వందే భారత్ రైళ్లను రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకురావడంతో చాలామంది దూర ప్రయాణాలకు వాటికే ఓటు వేస్తున్నారు. అయితే ఈ ప్రయాణాలకు సంబంధించి కొంతమంది టికెట్లు కొనుగోలు చేయరు. టీసీలకు దొరకకుండా బోగిల వెంట బోగీలు మారుతుంటారు. వీరిని అన్నిసార్లు పట్టుకోవడం కుదరకపోయినప్పటికీ.. కొన్నిసార్లు మాత్రం టీసీలు పట్టుకుంటారు. అపరాధ రుసుం విధిస్తారు. ముక్కు పిండి ఫైన్ వసూలు చేస్తారు. కొన్నిసార్లు జైలు శిక్ష కూడా విధిస్తారు. అయినప్పటికీ కొంతమంది టికెట్ లేకుండానే రైలు ప్రయాణం సాగిస్తారు.వాస్తవానికి మన రైల్వే వ్యవస్థ ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్దది. రోజుకు లక్షల్లోనే ప్రయాణికులు రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. రైల్వే చార్జీలు కూడా సామాన్లకు అందుబాటులోనే ఉంటాయి. అయితే ఈ రైళ్లల్లో కొన్ని నిబంధనలు ఉంటాయి. వాటిని ఉల్లంఘిస్తే రైల్వే శాఖ కేసులు పెడుతుంది. జరిమానాలు విధిస్తుంది. అయితే ఈ రైళ్లల్లో ప్రయాణించేవాళ్లు కచ్చితంగా టికెట్ కొనుగోలు చేయాలి. టికెట్ లేకుండా ప్రయాణం చేస్తే రైల్వే శాఖ ఊరుకోదు. టికెట్ లేకుండా ప్రయాణం చేసినట్టు దొరికిపోతే అపరాధ రుసుం విధిస్తుంది. ఇలా ప్రయాణికుల నుంచి ఒక సంవత్సరంలో రైల్వే శాఖ 173.89 కోట్లు జరిమానాగా వసూలు చేసింది. పశ్చిమ రైల్వే విభాగం ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు పలు రైళ్లల్లో టీసీ ల ద్వారా చెకింగ్ నిర్వహించింది. ఇలా చేయగా రైల్వే శాఖకు 173.89 కోట్లు వసూలయ్యాయి. ఇందులో ముంబై ప్రాంతం నుంచే 46.90 కోట్లు ఫైన్ రూపంలో వచ్చాయి.ఇక గత మార్చి నెలలో 16.77 కోట్ల పెనాల్టీని రైల్వే శాఖ వసూలు చేసింది.. ఏసీ బోగీల్లో అనధికార ప్రయాణాలను నిలిపి వేసేందుకు రైల్వే అధికారులు చెకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి వరకు సుమారు 60 వేల మంది ప్రయాణికులు టికెట్ లేకుండా ప్రయాణం చేసినట్టు గుర్తించారు. వారి నుంచి జరిమానా వసూలు చేశారు. ఇంకా కొంతమందిని జైళ్లకు కూడా పంపించారు. అయితే గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది మార్చి వరకు రైల్వే అధికారుల చెకింగ్ లో 25% కంటే ఎక్కువ మంది ప్రయాణికులు టికెట్ లేకుండా రైళ్లల్లో ప్రయాణించారు. అధికారులు ఆ స్థాయిలో తనిఖీలు చేస్తున్నప్పటికీ అనధికార ప్రయాణాలు చేసే వారి సంఖ్య తగ్గడం లేదన్నమాట.

## ఆ ఆరింటిపై గులాబీ గురి



**హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది బీఆర్ఎస్ పార్టీ. 17 ఎంపీ సీట్లలో ఆరు స్థానాలపై మాత్రం గులాబీ పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. గులాబీ పార్టీని వీడి జాతీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న నేతల నియోజకవర్గాలను బీఆర్ఎస్ టార్గెట్ చేస్తోంది.చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న గడ్డం రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉండి కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఎన్నికల్లో ఆయన హస్తం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ సెగ్మెంట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నేతలతో వరుస సమీక్షలు నిర్వహిస్తూ పార్టీ గెలుపుకోసం వ్యూహాలు రచిస్తున్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పట్టు ఉండటంతో ఆమెకు ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించింది పార్టీ.జహీరాబాద్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బీబీ పాటిల్‌కు బ్రేకులు వేసేందుకు మాజీమంత్రి హరీశ్ రావు చక్రం తిప్పుతున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాములు బీజేపీలో చేరి తన కుమారుడు భరత్‌ను బరిలోకి దింపారు. ఆయనకు చెక్ పెట్టేలా అదే సామాజికవర్గానికి చెందిన బలమైన అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను బరిలోకి దించింది బీఆర్ఎస్.సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను బరిలోకి దించుతోంది. ఆదిలాబాద్‌లో గోడెం నగేష్‌ను ఎదుర్కొనేలా సీనియర్ నేత అత్రం సక్కుకు అవకాశం ఇచ్చారు. వరంగల్‌లో కడియం కావ్యను అభ్యర్థిగా ఖరారు చేసిన తర్వాత పార్టీ మారడంతో ఈ అంశాన్ని పార్టీ సీరియస్‌గా తీసుకుంది.ఓరుగల్లు నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతకే అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఆరూరి రమేష్ కూడా బీఆర్ఎస్ నుంచి వెళ్లిన నేత కావడంతో ఇద్దరికీ చెక్ పెట్టేలా బలమైన నేతను బరిలోకి దించాలని భావిస్తోంది బీఆర్ఎస్ అధిష్టానం. జిల్లాకు చెందిన నేతలతో పార్టీ అభిప్రాయ సేకరణ జరుపుతోంది. త్వరలో వరంగల్ అభ్యర్థిని పార్టీ అధికారికంగా ప్రకటించనుంది.పార్టీ మారి ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్న నేతలకు చెక్ పెట్టడంతో పాటు గౌరవప్రదమైన స్థానాలు దక్కించుకుంటేనే పార్టీ క్యాడర్‌లో జోష్ పెరుగుతుందని భావిస్తున్నారు గులాబీ నేతలు.

# కాంగ్రెస్ మేనిఫెస్టో మేజిక్ చేయగలదా....?




"పదేళ్ల బీజేపీ పాలనలో ఊకదంపుడు ప్రచారమే తప్ప జరిగిందేమీ లేదు. అంతటా నిరుద్యోగం, అధిక ధరలు, పడిపోతున్న వినియోగం వల్ల అభివృద్ధి కుంటుపడింది. పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అంతటా విద్వేషపూరిత విచ్ఛిన్న వాతావరణం కొనసాగుతోంది. రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి మెజారిటీవాదాన్ని ముందుకు తీసుకువచ్చారు. అసమానతలు పెరిగిపోయాయి. సమాజంలో ప్రతి వర్గం భయంతో జీవిస్తోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం సాధించగల సామర్థ్యం కాంగ్రెస్ పార్టీకే ఉన్నది. 1965, 1971 యుద్ధాల్లో విజయం సాధించి దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉన్నది. 1991లో కాంగ్రెస్ ప్రభుత్వమే దేశంలో చెప్పుకోదగ్గ మార్పులను తీసుకువచ్చింది. "కాంగ్రెస్‌పై మరోసారి విశ్వాసం చూపండి" అంటూ గత వారం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్రం' పేరుతో విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో పిలుపునిచ్చింది. ఒకరకంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు. రెండుసార్లు పార్టీకి సారథ్యం వహించి విఫలమైన రాహుల్ గాంధీ ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు కానప్పటికీ ఆయనే రథసారథి. అందువల్ల ఈ ఎన్నికల తర్వాత ఆయన పాత్ర ఎలా ఉంటుంది, కాంగ్రెస్ నాయకత్వం తీరుతెన్నులు, సంస్థ స్వరూపం ఎలా మారుతాయి అన్న వాటిపై అంతర్గత చర్చ జరుగుతోంది. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఇదే ఆఖరి పోరాటం లాగా కాంగ్రెస్ నేతలు పోరాడుతున్నారు. వందలాది సభలు, సమావేశాలు, వార్ రూమ్ సమాలోచనలు, రాష్ట్ర నేతలతో చర్చలు, యాత్రలు నిర్వహిస్తున్నారు. అక్బర్ రోడ్?లో ఏఐసీసీ కార్యాలయం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తోంది. "మా పార్టీ ఒక థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్ లాంటిది. పోయేవారు పోతున్నా, వచ్చేవారు వస్తూనే ఉంటారు. జాగా లేదని చెప్పినా తోసుకుని వచ్చేవారు ఉండనే ఉంటారు" అని ఒకప్పటి ఏఐసీసీ అధికార ప్రతినిధి వి.ఎన్. గాడ్గిల్ చాలా కాలం క్రితమే వ్యాఖ్యానించారు. స్పష్టంగా చెప్పాలంటే ఒక రాజకీయ పార్టీ వాతావరణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తప్ప మరెక్కడా కనపడదు. ముఖ్యమంత్రులైనా, బడా నేతలైనా ఢిల్లీ వచ్చేసరికి పార్టీ ప్రధాన కార్యదర్శులను కలుసుకునేందుకు వేచి చూడాల్సిందే. పార్టీ కార్యాలయంలో పనిచేసే పీఏలను, ప్యూన్?లను ప్రసన్నం చేసుకునే నేతలు కూడా కనపడతారు. ఒక రకంగా అక్బర్ రోడ్ కార్యాలయం మినీ ఇండియాను తలపిస్తుంది. పార్టీకి మూల కేంద్రాలైన సోనియా, రాహుల్ ఒక కుటుంబానికి చెందిన వారైనా ఒక పార్టీగా కాంగ్రెస్ సంస్కృతి భిన్నమైంది. వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమైనదనే భావన ఆ పార్టీ కార్యాలయంలోకి వచ్చాక కలుగుతుంది. "కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం ఆధిపత్యం కొనసాగడం లేదా?" అని టైమ్స్ ఆఫ్ ఇండియా సంపాదకుడు దిలీప్ పడగోంకర్ 1991 జూన్ 9న అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావును చేసిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. ఇందుకు పి.వి. సమాధానమిస్తూ "కుటుంబం అనే ఈ అంశంపై నాకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. నేను రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు నాకు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలతో వ్యక్తిగత పరిచయం లేదు. కాని కాంగ్రెస్ పార్టీయే ఒక సైద్ధాంతిక కుటుంబంగా నాకు అనిపించింది. మీరంటున్న ఒకరిద్దరు కుటుంబ సభ్యులు కూడా ఒక పెద్ద కుటుంబంలో భాగం. వారూ ఈ దేశ ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు తగినట్లుండాల్సిన వారే. అందువల్ల కాంగ్రెస్‌ను ఒకరిద్దరి వారసత్వానికి పరిమితం చేయవద్దు" అని చెప్పారు. అందువల్ల వారసత్వానికి చెందిన కుటుంబ నేతలే కాంగ్రెస్ పార్టీ అనుకోవడానికి వీల్లేదు. పార్టీ గతిశీలతకు వారు ఇరుసులా పనిచేస్తున్నప్పటికీ ఆ గతిశీలతకు వారే కారణాలు కానేకాదు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్ రెడ్డి 33 లోక్‌సభ సీట్లు సాధించినాబీ కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ విజయాలు సాధించినా అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో తలెత్తిన నేతలు ప్రజల్లో పార్టీ బలంగా ఉన్నదనే విశ్వాసం కలిగించారు. స్థానికంగా బలోపేతమైన నాయకులే కాంగ్రెస్ పార్టీకి బలం. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీలో ఒక మేధో వలయం స్పష్టంగా కనిపిస్తుంది. పివి నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, శంకర్ రావు చవాన్, జగజీవన్ రామ్, కమలాపతి త్రిపాఠీ, శివశంకర్, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, గాడ్గిల్, జైపాల్ రెడ్డి, హెచ్.ఆర్. భరద్వాజ నుంచి మన్మోహన్ సింగ్, వీరప్ప మొయిలీ, చిదంబరం, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, కె.రాజు, శశిథరూర్, అభిషేక్ సింఘ్వీ తదితరుల వరకు కాంగ్రెస్?లో మేధో సంపద కనిపిస్తూనే ఉంటుంది. వీరు కాక మాజీ అధ్యాపకులు, వైస్ చాన్స్‌లర్లు, జర్నలిస్టులు, న్యాయవేత్తలు, శాస్త్రవేత్తలు కాంగ్రెస్?కు భావజాలపరంగా మద్దతునిస్తూనే కనపడతారు. వీరంతా ఒక టీమ్?గా పనిచేస్తూ కాంగ్రెస్‌కు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకత్వం అందించేందుకు ప్రయత్నిస్తారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోకు ప్రాధాన్యత ఉన్నది. ఇది ఒక్కరు రూపొందించిన పత్రం కానే కాదని, ఎంతో మథనం తర్వాత రూపొందించిన పత్రమని చదివిన వారికి అర్థమవుతుంది. ఈ మేనిఫెస్టో ఓబీసీ, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, రైతులకు సామాజిక న్యాయం అందించే దిశగా తమ ఆలోచనలను, కార్యాచరణను ప్రకటించింది. నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు పెద్ద ఎత్తున నిధులను ప్రకటించింది. తమ హయాంలోనే గ్రామీణ ఉపాధి పథకం, ఆహార భద్రత వంటివి ప్రవేశపెట్టిన విషయాలను గుర్తు చేసింది. రైతుల గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించడం, నిరుద్యోగ యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపకార వేతనం, ప్రతి పేద కుటుంబానికి రూ. లక్ష నగదు, లక్షలాది ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వోద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయడం, పేదలకు అదనపు భూమిని బదిలీ చేయడం, అగ్నిపథ్‌ను రద్దు చేయడం వంటి అనేక హామీలను కాంగ్రెస్ గుప్పించింది. ఒక రకంగా ఇది పేదలకు అనుకూలంగా, వివిధ అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించే దిశగా రూపొందించిన పత్రం. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా సామాజిక న్యాయం విషయంలో బీజేపీకి భిన్నంగా తాను ఏ విధంగా ఆలోచిస్తుందో చెప్పేందుకే తన మేనిఫెస్టో డాక్యుమెంట్‌ను రూపొందించింది. కాని ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళ్లగలుగుతుందా? దేశ ప్రజలు ఈ మేనిఫెస్టోను సీరియస్‌గా తీసుకుంటారా? కాంగ్రెస్ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని, సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని సాధించగలదని ప్రజలు విశ్వసిస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీకి భిన్నమైన ఆలోచనా విధానం గల పార్టీగా కాంగ్రెస్ తనను తాను ఎంత రూపుదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ జనాన్ని ఆ దిశన ఎంత మేరకు ఆలోచింప చేయగలదనేది చర్చనీయాంశం. కాంగ్రెస్ పార్టీని ఎప్పుడూ గతంలో చేసిన తప్పులు వెంటాడుతుంటాయి. బీజేపీపై ఇప్పుడు చేసే ప్రతి విమర్శా ఎప్పుడో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొన్నదే. ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిరస్కరించినట్లే బీజేపీని కూడా తిరస్కరించే క్రమం రాకపోదు కాని కాంగ్రెస్‌లో మార్పు వచ్చిందని, అది తమ కోసం నిలబడుతుందని ప్రజలు గ్రహించే వరకూ మళ్లీ ఆ పార్టీ జనాదరణ కోసం వేచి చూడాల్సి ఉంటుంది. విచిత్రమేమంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశాల గురించి చర్చించి అవి ఎలా ఆచరణసాధ్యం కావో వివరించేందుకు బీజేపీ నేతలు పూనుకోవడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లింలీగ్ మేనిఫెస్టో గానో, పాకిస్థాన్ మేనిఫెస్టో గానో చిత్రించి కొట్టి పారేస్తున్నారు. నిజానికి కాంగ్రెస్ మేనిఫెస్టోను ఎండగట్టి తాము ఏ విధంగా సామాజిక న్యాయం చేస్తున్నామో, అభివృద్ధిపై తమ దృక్కోణం ఏమిటో ప్రజలకు వివరించే అవకాశం బీజేపీకి ఉంది. కాని బీజేపీ నేతల దారి వేరు. కాంగ్రెస్‌ను హిందూ వ్యతిరేక పార్టీగా చిత్రిస్తే మిగతా అంశాలను ప్రజలు విస్మరిస్తారనేదే ఆ పార్టీ నేతల అభిప్రాయం. మరో పది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు తీసుకునే నిర్ణయం అత్యంత కీలకమైనది.

## ఫంక్షన్‌హాళ్లపై పట్టింపేది..?




**జనగామ :** జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టినరోజు, ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం దొంగలకు కలిసొచ్చింది. యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. దొంగల భయంతో జిల్లాలో చాలా మంది తమ ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ.. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంలో వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్‌హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ఇటు యజమానులు గానీ, అటు పోలీసులు, అధికారులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయం. జిల్లావ్యాప్తంగా సుమారు 60 నుంచి 70 వరకు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వీటిలో 70-80 శాతం ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేవు. జిల్లాకేంద్రంతో పాటు పెంబర్తిలోని రెండు ఫంక్షన్‌హాళ్లలో ఇటీవల ఒకే రోజు మూడు చోరీలు జరిగాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఫొటోగ్రాఫర్ల కెమెరాలు, లెన్స్, డ్రోన్ కెమెరాలను ఎత్తుకెళ్లారు. పెళ్లి ఫొటోలు తీయడంలో ఫొటోగ్రాఫర్లు బిజీగా ఉండగా దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. జిల్లాకేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో ఆలేరుకు చెందిన ఫొటోగ్రాఫర్ రాయపురం శ్రీనివాసకు చెందిన రూ. 1.80 లక్షల విలువైన డ్రోన్ ఎత్తుకెళ్లారు. అదే విధంగా పెంబర్తిలో బీఎంఆర్ గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ అక్షయ్‌కు చెందిన రూ.20 వేల విలువైన కెమెరా లెన్స్ చోరీకి గురైంది.

## కొనుగోలు కేంద్రాల్లో ఐరిస్ విధానం



**జఫర్‌గడ్ :** దళారీ వ్యవస్థను నిర్మూలించి, ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్న లక్ష్యం తో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు క్రేందాలను ఏర్పాటు చేస్తోంది. ఈ బాధ్యతలను స్వ యం సహాయక మహిళా సంఘాలు, సహకార సంఘాలకు అప్పగిస్తోంది. అయితే ఈ కొనుగోళ్ల ప్రక్రి యలో సాంకేతిక ఇబ్బందులతో పాటు దళారుల బెడద నెలకొంటోంది. రైతులకు ఓటీపీ నంబర్ల సమస్యలు, కొన్ని చోట్ల మిల్లర్లు, వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతుల పేరిట కేంద్రాల్లో విక్రయాలు జరపడం వంటి సమస్యలు ఎదురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు గాను ఈ యాసంగి ధా న్యం కొనుగోళ్లలో ఐరిస్ విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఐరిస్ (కంటిపాప) అమలు కోసం స్వయం సహాయక సంఘాల ప్రతిని ధులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. వారం రోజుల్లో జిల్లా లోని ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఐరిస్ యంత్రాలు అందనున్నాయి. జిల్లాలో మొత్తం 190 ధా న్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణ యించారు. తాజా విధానంలో ఓటీపీతో పాటు ఐరిస్ సాయాన్ని వినియోగించడంతో కొనుగోళ్లలో అక్రమా లకు ఆస్కారం ఉ ండదని భావిస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గతం లో ఓటీపీ విధానం అమలులో ఉండేది. రైతుబంధు పాస్ పుస్తకం నంబరుతో ఆధార్, మొబైల్ నంబరు అనుసంధానించారు. పంట విక్రయించిన రైతు ఆధార్, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబరును ట్యాబ్‌లో నమోదు చేస్తే వచ్చిన ఓటీపీతో ధాన్యం కొనుగోలు చేసేవారు. సంబం?ధిత రైతులు కేంద్రంలో లేకుండా వేరే చోట ఉన్నా.. అతడి మొబైల్ నంబరుకు వచ్చిన ఓటీపీ నం బరు చెబితే చాలు నమోదు చేసుకునేవారు. ఈ పాత విధానం వల్ల కొందరు వ్యాపారులు, దళారులు.. నిర్వా హకులతో కుమ్మక్కై.. రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యా న్ని కొనుగోలు చేసి.. ఆ? ధాన్యాన్ని రైతుల పేరుతో కొనుగోలు కేంద్రాల్లో మద్ధతు ధరకు విక్రయించి సొ మ్ము చేసుకుంటున్నారు.

# రష్యా, చైనా దౌత్య సంబంధాలకు 75ఏళ్ళు....



**బీజింగ్ :** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం ఇక్కడ రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్‌తో భేటీ అయ్యారు.రష్యా, చైనాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు తమ తరపున శు భాకాంక్షలు తెలియచేయాల్సిందిగా జిన్‌పింగ్ కోరారు. ఇరు దేశాల సంబంధాలు సాఫీగా, నిలకడగా అభివృద్ధి చెందేలా పరస్పరం మార్పిడులు కొనసాగించాలని పుతిన్, తాను అంగీకరించినట్లు జిన్‌పింగ్ తెలిపారు. దౌత్య సంబంధాల వార్షికోత్సవాన్ని అవకాశంగా తీసుకుని ఇరువురు నేతల మధ్య కుదిరిన కీలకమైన ఏకాభిప్రాయాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. తమ జాతీయ ప్రయోజనాలకు అనువైన అభివృద్ధి పంథాను అనుసరించడంతో రష్యా ప్రజలకు చైనా మద్దతునిస్తుందని చెప్పారు. తీవ్రవాదాన్ని ఎదుర్కొనడంలో, సామాజిక భద్రతను, సుస్థిరతను కొనసాగించడంలో రష్యాకు తోడ్పాటునందిస్తామన్నారు. చైనా-రష్యా సంబంధాల అభివృద్ధికి చైనా ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందన్నారు. రష్యాతో ద్వైపాక్షిక కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడానికి సిద్ధంగా వున్నామన్నారు.

## 'అది' తప్ప మోదీ చేసిందేమీ లేదు....



**చెన్నై :** కుటుంబంలా జీవిస్తున్న భారతదేశ ప్రజలను మతం పేరుతో విభజించడం తప్ప ప్రధాని నరేంద్ర మోదీ చేసిందేమీ లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. మదురై లోక్‌సభ అభ్యర్థి ఎస్.వెంకటేశన్, శివగంగ అభ్యర్థి కార్తీ చిదంబరం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఏళ్ల తరబడి మౌనం వహించిన నరేంద్ర మోదీ ఇప్పుడు మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బిల్కిస్ బాను అత్యాచారం కేసులో నిందితులు నిర్దోషులుగా విడుదలైనప్పుడు, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు వచ్చినప్పుడు మోదీ మౌనంగా ఉన్నారని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు, బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ అత్యాచారం కేసులో నిందితుడైనప్పుడు, ఉన్నావ్, హత్రాస్ ఘటనల్లో బాధితురాలి కుటుంబానికి అన్యాయం జరిగినప్పుడు కూడా మోదీ మౌనంగానే ఉన్నారని ఆగ్రహించారు. కుటుంబంలా జీవిస్తున్న ప్రజలను మతం పేరుతో విభజించడం తప్ప నరేంద్ర మోదీ చేసిందేమీ లేదని స్టాలిన్ విమర్శించారు.

## నెతన్యాహు పెద్ద తప్పు చేస్తున్నావ్...



గాజాగాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్న వేళ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సీరియస్ అయ్యారు. నెతన్యాహు తప్పు చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వైఖరి మారకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. గాజాలో గత వారం జరిగిన డ్రోన్ దాడిలో వరల్డ్ కిచెన్ సెంటర్ (డబ్ల్యూకేసీ) స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న ఏడుగురు మరణించారు. ఈ ఘటనపై అగ్రరాజ్యం తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటన నేపథ్యంలోనే బైడెన్ స్పందించారు. తాజాగా ఓ టీవీ కార్యక్రమంలో బైడెన్ మాట్లాడుతూ.. గాజాలో నెతన్యాహు తప్పు చేస్తున్నారు. ఆయన వైఖరిని అంగీకరించను. ఆరు లేదా ఎనిమిది వారాలపాటు తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని నేను ఇజ్రాయెల్ సైన్యాన్ని కోరుతున్నాను. ఈ సమయంలో శరణార్థులకు ఆహారం, ఔషధాలను సరఫరా చేయవచ్చు అని అన్నారు. ఇదే సమయంలో బైడెన్.. జోర్డాన్, సౌదీ, ఈజిప్ట్ దేశాలు కూడా సహాయం, ఆహారం పంపేలా నిత్యం వారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు స్పష్టం చేశారు. వారు కూడా దీనికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గాజాలోని ప్రజలకు ఔషధాలు, ఆహార సరఫరాలో ఎటువంటి రాజీ ఉండదని చెప్పారు. మరోవైపు శ్వేతసౌధం స్పందిస్తూ సంధి కోసం ఇజ్రాయెల్ కొన్ని చర్యలు తీసుకొందని వెల్లడించింది. కానీ, హమాస్ వైపు స్పందన మాత్రం అంత ప్రోత్సాహకరంగా లేదని పేర్కొంది. ఇక, ఇజ్రాయెల్ ప్రభుత్వం దీనిపై స్పందిస్తూ అమెరికా, ఐరాస డిమాండ్ చేసిన విధంగానే గాజాలోకి సరఫరాలను పెంచామని వివరించింది. తాము వీటికి ఎటువంటి ఆటంకాలను సృష్టించడం లేదని తెలిపింది. సోమవారం 468 ట్రక్కులు, మంగళవారం 419 ట్రక్కుల సామగ్రిని తరలించినట్లు చెప్పింది. యుద్ధం మొదలైన నాటికి ఇదే అత్యధికమని వెల్లడించింది. గాజాలోని ప్రజలకు ఔషధాలు, ఆహార సరఫరాలో ఎటువంటి రాజీ ఉండదని చెప్పారు. మరోవైపు శ్వేతసౌధం స్పందిస్తూ సంధి కోసం ఇజ్రాయెల్ కొన్ని చర్యలు తీసుకొందని వెల్లడించింది.

# ఉత్తర కొరియా కిమ్ సంచలన వ్యాఖ్యలు



నార్త్ కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తర కొరియాలో నెలకొన్న అస్థిరమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో యుద్ధం తప్పదని అన్నారు.యుద్ధాన్నికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆయన బుధవారం దేశంలోనే కీలకమైన కిమ్ జోంగ్-ఇల్ మిలిటరీ యూనివర్సిటీని సందర్శించారు. ఈ యూనివర్సిటీ కిమ్ తండ్రి పేరు మీద 2011లో స్థాపించారు. దేశంలో మిలిటరీ విద్యలో అత్యధికంగా సీట్లు ఉ?న్న యూనివర్సిటీ ఇది.యూనివర్సిటీ సందర్శన సమయంలో విద్యార్థులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కిమ్ జోంగ్ ఉన్ మాట్లాడారు. 'ఉత్తర కొరియా చుట్టూ.. అంతర్జాతీయంగా క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమయంలో దేశంలో నెలకొన్న అస్థిరమైన పరిస్థితుల నడుమ యుద్ధం తప్పదు. శత్రు దేశాలు యుద్ధ కవ్వింపు చర్యలకు పాల్పడితే.. ఎలాంటి సంకోచం లేకుండా యుద్ధం చేయడానికి నార్త్ కొరియా సిద్ధంగా ఉంది' అని అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వ్యాఖ్యానించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఇప్పటికే నార్త్ కొరియా రాజకీయంగా, ఆయుధ తయారీలో రష్యాతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు వ్యూహాత్మక మిలిటరీ ప్రాజెక్టుల్లో నార్త్ కొరియా సాయం అందిస్తోంది. ఇటీవల కొరియా ఘన ఇందనంతో మధ్యశ్రేణి సూపర్ సోనిక్ బాలిస్టిక్ మిసైల్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. అయితే ఇది ద్రవ ఇందనంతో పోల్చితే చాలా శక్తివంతమైందని నిపుణులు పేర్కొన్నారు. తరచూ అమెరికా, దక్షిణ కొరియా తమ సైనిక విన్యాసాలతో ఉత్తర కొరియాను కవ్విస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది.

## కరాచీలో పెరిగిన యాచకుల సంఖ్య.. ఆందోళనలో ప్రభుత్వం....!

పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు, సంస్థల నుండి తీసుకున్న రుణాలతో పాక్ రోజులు నెట్టుకొస్తోంది. రంజాన్ మాసంలో పాకిస్తాన్‌లోని కరాచీ నగరం బిచ్చగాళ్ల రాజధానిగా మారింది. దేశంలోని నలుమూలల నుంచి నాలుగు లక్షలకు పైగా యాచకులు కరాచీ చేరుకున్నారని, దీంతో నగరంలో నేరాలు పెరిగాయనే వార్త ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రంజాన్ మాసంలో కరాచీలోని ప్రతి కూడలిలో యాచకులు దర్శనమిస్తున్నారని, దీనికితోడు నగరంలో ఇటీవలి కాలంలో నేర సంఘటనలు మరింతగా పెరిగాయని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ ఉదంతంపై పాక్‌కు చెందిన జియో న్యూస్ ఛానల్ ఒక నివేదికను అందజేసింది. దానిలో కరాచీ పోలీస్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఏఐజీ) ఇమ్రాన్ యాకూబ్ మిన్హాస్ మాట్లాడుతూ, ఈద్, రంజాన్ సమయంలో పాకిస్తాన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి యాచకులు కరాచీకి వచ్చారని, వారి సంఖ్య సుమారు నాలుగు లక్షల వరకు ఉండవచ్చన్నారు. ప్రస్తుతం



కరాచీలో యాచకుల సంఖ్య పెరిగిందని, అలాగే నేరాల సంఖ్య కూడా పెరిగిందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. నగర అదనపు ఐజీ మాట్లాడుతూ పాత పద్ధతుల్లో నేరస్తులను పట్టుకోవడం కష్టసాధ్యమని, అందుకే ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఇటీవలి కాలంలో నగరంలో చోటుచేసుకున్న పలు నేరాల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారని పలు మీడియా నివేదికలు తెలియజేస్తున్నాయి.

## పనామా పత్రాల కేసులో విచారణ షురూ!



పనామా సిటీ : ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పనామా పత్రాల కేసులో మనీ లాండరింగ్ ఆపరేషన్‌కు సంబంధించి అభియోగాలు మోపిన 27మందిపై సోమవారం ఇక్కడి పనామా క్రిమినల్ కోర్టులో విచారణ మొదలైంది. 2016లో పెద్ద ఎత్తున పత్రాలను లీక్ కావడంతో దీనంతటికీ మూలమైన మొసాక్-ఫోన్సెకా (న్యాయ సంస్థ) యజమానులు కూడా ఈ విచారణను ఎదుర్కొంటున్నవారిలో వున్నారు. ప్రపంచంలోనే అత్యంత కుబేరులైన వ్యక్తులు కొందరు తమ దేశాల్లో పన్ను ఎగ్గొట్టి, పనామాలోను, బ్రిటిష్ వర్జిన్ ఐలండ్స్ వంటి చోట్ల డొల్ల కంపెనీలను పెట్టి పెద్ద మొత్తంలో వి నల్లధనాన్ని 2000 సంవత్సరం నుంచి ఎలా దాచుకున్నారో ఈ పత్రాలు వెల్లడిస్తున్నాయి. ఈ రహస్య పత్రాలను జర్మనీకి చెందిన వార్తా పత్రిక సుడుచ్చె జీటుగ్, అంతర్జాతీయ ఇన్విస్టిగేటివ్ జర్నలిస్టుల కన్సార్షియంతో కలపి బయటపెట్టాయి. మనీలాండరింగ్ వ్యవహారంలో వీరికి మొసాక్-ఫోన్సెకా అనే న్యాయ సంస్థ తోడ్పాటు నందించింది. పెద్ద మొత్తంలో నల్ల డబ్బును విదేశీ బ్యాంకుల్లో రహస్యంగా ఏ విధంగా దాచుకుంటున్నారో తెలియచేసే కోటీ 10లక్షల రహస్య డాక్యుమెంట్లను బయటపెట్టడాన్నే పనామా పత్రాలుగా పేర్గాంచాయి. ఈ కేసు పర్యవసానాలు చాలా విస్తృతంగా వున్నాయి. ఐస్‌ల్యాండ్ మాజీ ప్రధాని రాజీనామాతో పాటు అర్జెంటీనా, ఉక్రెయిన్ తదితర నేతలపై కూడా స్క్రూటినీ జరిగింది.భారత్‌కు చెందిన బడా బాబులు కూడా కొందరు ఇందులో ఉన్నారు. చాలాకాలం నుండి ఆలస్యమవుతూ వస్తున్న విచారణ ఎట్టకేలకు సోమవారం ప్రారంభమైంది. ఈ చర్యలకు తాము దోషులం కాదని జురెగెన్ మొసాక్, రామన్ ఫోన్సెకా కోర్టు రూమ్‌లో స్పష్టం చేశారు.

## మా ఆశా జ్యోతి పూలే.....!

స్వతంత్ర భారతాన గాంధీజీ మహాత్మా అయితే, స్వతంత్ర భారతానికి వందేళ్ళ ముందే బడుగు బలహీన వర్గాలచే మహాత్ముడిగా జన నీరాజనాలు అందుకున్న సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబాపూలే. సామాజికోద్యమాలకు ఆద్యుడై స్వేచ్ఛా, సమానత్వ, ఐక్యమత్య సమాజం కోసం అనునిత్యం శ్రమించారు. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. స్త్రీలు విద్యావంతులు కావాలని ముందుగా తన భార్య సావిత్రీబాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అంతేగాక అన్ని కులాల వారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి, విద్యాభివృద్ధికి కృషి చేశారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించిన జ్యోతిరావ్ గోవింద్ రావు పూలే అన్ని రకాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతియై, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు. వారి తండ్రి గోవిందరావు మొదట్లో కూరగాయలు అమ్మేవాడు. కాలక్రమేణా పీష్వా పరిపాలనా కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారి ఇంటి పేరు ఫూలేగా మార్పు చెందింది. సంవత్సరం వయస్సులోపే తల్లిని కోల్పోయిన పూలే, ఏడేళ్ల వయస్సులో ఒక మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించి, తరువాత చదువు మానేసి వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉ ండేవాడు. పుస్తక పఠనం పట్ల చాలా ఆసక్తిని కలిగి ఉన్న పూలేను చూసి ఇంటి ప్రక్కనే ఉన్న ఒక ఉపాధ్యాయుడు, ఒక పెద్ద మనిషి జోతిరావ్ తండ్రిని ఒప్పించి ఆయన విద్యాభ్యాసం కొనసాగేలా చేశారు. ఆయన 1841లో స్కాటిష్ మిషన్ పూణేలో నడుపుతున్న పాఠశాలలో చేర్పించాడు. చిన్నప్పుడే మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపై జ్ఞానాన్ని సంపాదించాడు పూలే. జ్యోతిరావ్‌కు చిన్నప్పటి నుంచే శివాజీ అంటే అభిమానం ఎక్కువ. శివాజీ, జార్జ్ వాషింగ్టన్‌ల జీవితచరిత్రలు ప్రభావితం చేయడంవల్ల దేశభక్తి, నాయకత్వ గుణాలు అలవాటయ్యాయి. థామస్ రచించిన 'మానవ హక్కులు' పుస్తకం అతని ఆలోచనలను ప్రభావితం చేసింది. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని, కావున స్త్రీలు విద్యావంతులు కావాలని ముందు తన భార్య సావిత్రీబాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అంతే గాక అన్ని కులాలవారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి, విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఆనాటి సమాజంలో జరిగే బాల్య వివాహాల వల్ల చిన్నతనంలోనే వితంతువులైన మహిళలకు పునర్వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. దేశంలోనే మొట్టమొదటిగా 'బాలహత్య ప్రతిబంధక్ గృహ కేంద్రాన్ని స్థాపించి, వితంతు గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో పూలే, బిసి అని కుల వివక్షకు గురయ్యాడు. ఆ క్షణం నుండి కుల వివక్షపై పోరాటం మొదలు పెట్టి సత్యాన్ని నిగ్గుతేల్చిన సత్యాన్వేషకుడు. కుల విధానంలో ఆయన బ్రాహ్మణులను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞాన సంపదకు అందరికీ అవకాశం ఇవ్వకపోవడానికి ఆయన అభ్యంతరం తెలిపి వేదాలకు కొత్త భాష్యం చెప్పిన భాష్యకుడు. సామాజికోద్యమాలకు ఆద్యుడై స్వేచ్ఛా, సమానత్వ, ఐక్యమత్య సమాజం కై అనునిత్యం శ్రమించాడు. స్త్రీ,పురుష లింగ వివక్ష, కుల బానిసత్వంపై అలుపెరుగని పోరాటం చేశాడు. సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి గులాంగిరి, పూణే సత్య శోధక సమాజ నివేదిక, తృతీయ రత్న, ఛత్రపతి శివాజీ, రాజ్‌భోంస్లే యాంఛ, విద్యాకా థాతిల్, బ్రాహ్మణ్ పంతోజి మొదలెట్కన రచనలు చేశారు. దక్షిణాఫ్రికా జాతీయోద్యమ నాయకుడు నెల్సన్ మండేలా ఆ దేశాధ్యక్షుడయ్యాక భారతదేశ పర్యటనకు వస్తున్న సందర్భంలో ఆ మహనీయునికి గౌరవ కానుకగా సమర్పించిన 'గులాంగిరి' మహాత్మ పూలే రచించిన మహత్తర గ్రంథం. వితంతు మహిళా, అనాధ శిశువులకై 'సేవాసదనం' స్థాపించారు. బహుజనుల్ని బానిసలు చేసిన దాస్య భావాల బోధకులను ఎదిరించి, వర్ణవ్యవస్థపై తిరుగులేని బావుటా ఎగరేసిన తిరుగుబాటుదారుడు.

సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించిన జ్యోతిరావ్ గోవింద్ రావు పూలే అన్ని రకాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతియై, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికుడు పూలే. రైతుల, కార్మికుల సమస్యలు బాధలు వివరించేందుకు 'దీనబంధు' వారపత్రికను స్థాపించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. సమసమాజ స్థాపనకై అనునిత్యం శ్రమించిన జ్యోతిబాపూలే 1890 నవంబరు 28న కన్నుమూశారు. బహుజనుల స్వతంత్రంకై సమరం సలిపిన ఆ మహనీయుడి జన్మదినాన స్మరించుకుందాం. సామాజికోద్యమాలకు ఆద్యుడై స్వేచ్ఛా, సమానత్వ, ఐక్యమత్య సమాజం కోసం అనునిత్యం శ్రమించారు. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. స్త్రీలు విద్యావంతులు కావాలని ముందుగా తన భార్య సావిత్రీబాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

# రాత్రి భోజనం తర్వాత వాకింగ్ చేస్తున్నారా....

నడక ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో మనందరికీ తెలిసిందే. ఆరోగ్యంగా ఉండేందుకు చాలా మంది రన్నింగ్, బ్రిస్క్ వాకింగ్ చేస్తుంటారు. అలాగే రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకోకుండా వాకింగ్ చేస్తూ ఉంటారు.అయితే రాత్రి భోజనం తర్వాత వేగంగా నడవాలా లేదా నెమ్మదిగా నడవాలా అనే చాలామంది మదిలో మెదిలే ప్రశ్న. రాత్రిపూట చాలామంది తరచుగా చూస్తూ ఉంటాం. రాత్రి భోజనం తర్వాత కొంత సమయం పాటు చల్లగాలికి నడిచి ఆ తర్వాత మెల్లిగా పడుకుంటారు. అయితే ఆహారం తిన్నాక నేరుగా పడుకునే వారు కొందరున్నారు. ఇలా చేయడం వల్ల ఫుడ్ సరిగా జీర్ణం కాదు. ఉదయం నిద్ర లేచిన తర్వాత జీర్ణ సమస్యలు రావచ్చు. ఈ సమస్యను నివారించడానికి ఆహారం తిన్న తర్వాత తప్పనిసరిగా నడవాలి. అయితే మీరు ఎంతసేపు, ఏ వేగంతో నడవాలో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి 7 గంటలకే డిన్నర్ చేయాలని పలువురు ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

రాత్రి భోజనం చేసిన వెంటనే వాకింగ్‌కి వెళ్లకండి. తిన్న తర్వాత కనీసం గంట సేపు గ్యాప్ ఇవ్వాలంటున్నారు. అలాగే రాత్రిపూట స్పీడ్ గా కాకుండా వీలైనంత నెమ్మదిగా నడవండి. రాత్రి భోజనం తర్వాత అరగంట నుంచి గంట వరకు సాధారణంగా నడవాలంటున్నారు. అలా కాకుండా వేగంగా నడవడం వల్ల కడుపులో నొప్పి వస్తుందట. 1. సులభంగా ఆహారం జీర్ణం.. రాత్రి భోజనం చేసిన తర్వాత అరగంట పాటు నడవడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడుతుంది. అజీర్ణం, కడుపునొప్పి, గ్యాస్ వంటి సమస్యలు కూడా రావు. 2. మెటబాలిజం బూస్ట్.. రాత్రి భోజనం తర్వాత నడవడం వల్ల మీ జీవక్రియ పెరుగుతుంది. మీ బరువును అదుపులో ఉంచుతుంది. 3. రోగనిరోధక శక్తి.. రాత్రి భోజనం చేసిన తర్వాత వాకింగ్ చేసే అలవాటు వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీని ద్వారా అనేక రకాల సీజనల్ వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందుతారు. మీ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ నడవాలి. 4. ప్రశాంతమైన నిద్ర.. నడక వల్ల శరీరంలో ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఈ హార్మోన్ మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది, దీని వలన మంచి నిద్ర వస్తుంది.




## మునక్కాయలు అతిగా తింటున్నారా...



మనలో చాలా మంది మునక్కాయలు ఇష్టంగా తింటారు. ఇందులోని పోషకాలు రక్తంలో చక్కెర , ఇన్సులిన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడతాయి. కానీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు మునగకాయ తినేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి..ఇది హైపోక్సేమియాకు కూడా కారణమవుతుంది. షుగర్‌ను నియంత్రించడానికి, నిపుణులు మీ ఆహారంలో తక్కువ మొత్తంలో మునగకాయలను మాత్రమే తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. మునగలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ ప్రమాదకరం. శరీరానికి ఫైబర్ అవసరం అయినప్పటికీ, అతిగా తినడం మంచిది కాదు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల డయేరియా, మలబద్ధకం, ప్రేగు సమస్యలు, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కొంతమంది మునగకాయలను ఎక్కువగా తినడానికి ఇష్టపడరు. ఎందుకంటే ఇందులో ఉండే కొన్ని రసాయనాలు కొందరిలో అలర్జీని కలిగిస్తాయి. మునగకాయలను ఎక్కువగా తినడం వల్ల అలర్జీ వస్తుంది. ముఖ్యంగా రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి ఇది మరింత హానికరమని నిపుణులు అంటున్నారు. గర్భధారణ సమయంలో మహిళలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. వీటిలో ములగ కూరలు కొన్నిసార్లు గర్భిణీ స్త్రీలలో అలెర్జీలకు కారణమవుతాయి. ఇది పుట్టబోయే బిడ్డపై కూడా ప్రభావం చూపుతుంది.

## ఇది పిచ్చి మొక్క అనుకుంటున్నారా?



మన దేశంలో చాలా రకాల ఔషధ గుణాలు ఉన్న మొక్కలు ఉన్నాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. కానీ తెలిసిన వారు మాత్రం ఉపయోగిస్తుంటారు. ఇక నాటు వైద్యం, ఆయుర్వేదం, ఇతర సంప్రదాయ వైద్య పద్ధతుల్లో ఈ మొక్కలనే ఉపయోగిస్తారు. ఇలాంటి వాటిలో ముఖ్యమైనది గుంటగలగర మొక్క. పొలం గట్టున, నీటి కాలువల పక్కన ఉండే ఈ మొక్కకు చిన్నగా తెల్లని పూలు వస్తాయి. దీన్ని భృంగరాజ్ అని పిలుస్తారు కూడా. ఈ ఆకులతో తయారు చేసిన నూనెతో జుట్టు రాలడం అరికట్టవచ్చు. ఒత్తుగా, నల్లగా పెరగడానికి కూడా ఉపయోగపడుతుంది ఈ మొక్క. ఇందులో విటమిన్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకు రసం మొఖం ముడతలకు, మచ్చలకు, వృద్ధాప్య ఛాయలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. నూనెలతో కలిపి పొడిగా చేసి చర్మ వ్యాధులు, అలెర్జీలకు చికిత్సగా ఉపయోగించవచ్చును. అందుకే ఈ ఆకులకు, పొడికి ఫుల్ డిమాండ్ ఉంటుంది. శరీరం మొత్తానికి ఈ ఆకు మేలు చేస్తుంది. కాలేయం.. గుంటగలగర ఆకు లివర్ టానిక్ గా పనిచేయడంలో ముందుంటుంది. కాలేయ సంబంధిత సమస్యలను కూడా పోగొడుతుంది ఈ ఆకు. కాలేయ వ్యాపు, పచ్చకామెర్లు, ఫ్యాటీ లివర్ వ్యాధులను నయం చేస్తుంది. ఆకలి కూడా పెంచుతుంది. రోగనిరోధక శక్తి..ఈ ఆకును మూడు నుంచి నాలుగు నెలల పాటు తింటే రోగనిరోధక శక్తి అమాంతం పెరిగిపోతుంది. తేలికపాటి ఆహారం తిన్న తర్వాత రెండు సార్లు ప్రతి రోజు తినాలి. ఒక టీస్పూన్ భృంగరాజ్ చూర్ణాన్ని ఒక గ్లాసు పాలతో కలిపి సేవించవచ్చు. చర్మ సంబంధ వ్యాధులు కూడా తగ్గుతాయి. ఈ ఆకు నూనెను రాసుకోవడం వల్ల మొటిమలు తగ్గే ఆస్కారం కూడా ఉంటుంది.


# చెమట పట్టడం మంచిదేనా....?

ఎండాకాలం వచ్చినా, ఏదైనా కష్టమైన పని చేసినా వెంటనే చెమట వస్తుంటుంది. కొన్ని సార్లు ఈ చెమట స్మెల్ వల్ల ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండలో పనిచేస్తే ఈ చెమట బారిన పడకతప్పదు. ఇక కష్టమైన పని చేసినా ఈ చెమట ఇబ్బంది పెడుతుంది. ఇంతకీ చెమట పట్టడం మంచిదా? కాదా? చెమట వల్ల ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఎందుకు చెమట పడుతుంది? అనే వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. చర్మం తనలో ఉండే రక్తంలోని వ్యర్థాలను చెమట రూపంలో బయటకు పంపుతుంటుంది. చెమట ఎక్కువ పట్టేవారికి అందులో లవణాలు, పనికి రానీ వ్యర్థపదార్థాలను, ట్యాక్సిన్స్ ను చర్మంలోనికి పంపిస్తుంది శరీరం. ఈ చర్మం నుంచి చెమట రూపంలో బయటకు వస్తాయి వ్యర్థాలు. ప్రతి రోజు లీటర్ నుంచి 2 లీటర్ల చెమట పడితే ప్రతి రోజు శరీరంలో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతుంటాయి. ఎవరికి అయితే చెమట పట్టకుండా ఉంటుందో వారికి ఈ వ్యర్థాలు, లవణాలు చర్మ రంధ్రాల్లో పేరుకుంటాయి. చెమట రాకపోతే లోపలనే వ్యర్థాలు పెరిగి, టాక్సిన్స్ పెరిగి, కాలుష్యం ఎక్కువ అవుతుంటుంది. దీనివల్ల అనారోగ్యాలు తలెత్తుతాయి. అందుకే ఎంత చెమట పడితే అంత మంచిది అంటారు వైద్యులు. మన శరీరంలో ఉండే వ్యర్థాలను బయటకు పంపించే అతిపెద్ద అవయవం చర్మం. ఈ చర్మం వల్లనే చాలా రోగాల నుంచి కాపాడుకుంటున్నాం. మరి మీకు కూడా చెమట



వస్తుందా లేదా? చెమట రావడానికి చాలా మంది ఉదయం వర్కౌట్స్ కూడా చేస్తుంటారు. అందుకే మీరు ఏసీలో కూర్చుని పనిచేస్తుంటే రేపటి రోజు మీ ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని గుర్తుపెట్టుకోండి. అందుకే వెంటనే చెమట వచ్చే పనులు కొన్ని అయినా చేయండి. అలవాటు చేసుకోండి. లేదంటే మార్నింగ్ వాక్, జాగింగ్, వ్యాయామం చేయండి.


## ఈ ఆకు కూర ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!



ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మంచివి. అదేవిధంగా కాలే కూడా ఎన్నో ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో ఆరు రకాల విటమిన్లు మిలితమై ఉన్నాయి. విటమిన్ బీ6, విటమిన్ బీ 9, విటమిన్ బీ 2 విటమిన్ ఏ, సీ, కే లు పుష్కలంగా లభిస్తాయి. లింఫోసైట్స్, ఫాగోసైట్స్ అని పిలిచే తెల్ల రక్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది ఈ ఆకుకూర. ఇదొక క్యాబేజీ కుటుంబానికి చెందినది.

ఒక కప్పు లేదా 21 గ్రాముల ముడి కాలేలో కార్బోహైడ్రేట్స్ ఒక గ్రాము, ఫైబర్ ఒక గ్రాము, విటమిన్ కె లు లభిస్తాయి.విటమిన్ సీ ఏకంగా కాలే నుంచి 22 శాతం పొందవచ్చు. మాంగనీస్ ఏ 6 శాతం, రిబోఫ్లావిన్ 5 శాతం, కాల్షియం 4 శాతం పొందవచ్చు. కాలే లోని కొన్ని పోషకాలు జీర్ణవ్యవస్థలోని పిత్త ఆమ్లాలను బంధిస్తాయట. రక్తప్రవాహంలో గ్రహించకుండా నిరోధిస్తాయి. దీనివల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీన్ని పౌడర్ చేసుకొని వాడినా కూడా మంచి ఫలితాలను ఇస్తుంది. 8 వారాలు ప్రతి రోజు 14 గ్రాముల కాలే పౌడర్ ను తీసుకుంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. రక్తపోటు, చక్కెర స్థాయిలు, బెల్లీ ఫ్యాట్ లు నియంత్రణలో ఉంటాయి. క్యాన్సర్ కణాలపై వ్యతిరేకంగా పోరాడుతుంది కాలే. సల్ఫోరాఫేన్ అనే కౌంపౌండ్ ఉంటుంది కాబట్టి క్యాన్సర్ కణాలను ఏర్పడకుండా చూస్తుంది. ఇండోల్-3- కార్బినోల్ కూడా ఉంటుంది.

## నెలసరిలో వచ్చే నొప్పి వల్ల పిల్లలు పుట్టరా?



మహిళలు ఇంట్లో ఉంటారు వారికి ఏం టెన్షన్. హాయిగా తింటారు పడుకుంటారు అనే వారు చాలా మంది ఉన్నారు. కానీ ఒక ఆడపిల్లగా పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకు ఆమెకు చాలా కర్తవ్యాలు ఉంటాయి. అందులోనూ చాలా ఆచారాలు కూడా ఉంటాయి. కొన్నింటిని ఆమె మాత్రమే భరించాలి. అందులో భాగంగానే ఏ మగవారు కూడా అనుభూతి చెందలేని కొన్ని సమస్యలు మహిళలకు మాత్రమే ఉంటాయి. నెలసరి, గర్భం, బాలింత, విదవరాలు వంటివి కేవలం అమ్మాయికి మాత్రమే సొంతం.ఇక నెలసరి వచ్చినా ఏది జరిగినా ఇంట్లో పనులు చేయకుండా ఉంటే ఆ ఇంట్లో ఏ పని ముందుకు సాగదు. మరి కొందరికి నెలసరి సమయంలో చాలా కడుపు నొప్పి వస్తుంటుంది. ఇలా కడుపు నొప్పి వస్తే పిల్లలు పుట్టరనే ఓ నమ్మకం కూడా ఉంది. మరి ఇది ఎంతవరకు కరెక్ట్. దీనిమీద వైద్యులు ఏమంటున్నారు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. అయితే నెలసరి సమయంలో కడుపు నొప్పి ఎందుకు వస్తుంది? ఏ విధమైన నొప్పి అనే విషయాల మీద పిల్లలు పుడతారా? లేదా అనేది ఆధారపడి ఉంటుందట. నెలసరి మొదలైన దగ్గర నుంచి కడుపు నొప్పి ఉంటే అది కామన్ కడుపునొప్పి అంటున్నారు వైద్యులు. దీని వల్ల కడుపునొప్పి మాత్రలు కూడా వేసుకోవచ్చుట. దీని వల్ల పిల్లలు పుట్టరనే సమస్య లేదట. అయితే కొందరిలో 30–35 సంవత్సరాల మధ్యలో ఉన్నప్పుడు నెలసరిలో కడుపు నొప్పి వస్తే దీనికి కారణాలు వేరుగా ఉంటాయి. ఫైబ్రాయిడ్, ఎడినోమినేషియా, పీసీఓడీ, గర్భసంచి ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు మీ కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాలలో మాత్రమే ప్రెగ్నెన్సీ విషయంలో కాస్త ఇబ్బంది ఉంటుందట. అందుకే సెకండరీ స్టేజ్ లో డాక్టర్ ను సంప్రదించి వారి సలహాలు సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వయసు పెరుగుతున్న కొద్ది పిల్లలు పుట్టే అవకాశం మరింత తగ్గుతుంటుంది కాబట్టి జాగ్రత్త మస్ట్ అంటారు నిపుణులు.

## పాలకూర, టమాట తింటే కిడ్నీలో రాళ్లు పెరుగుతాయా?



ఆకుకూరలు, కూరగాయలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ అందుతాయి. తద్వార శరీరాన్ని వ్యాధుల సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. కానీ కొందరు ఆకుపచ్చని కూరగాయల కంటే ఎక్కువ రెస్టారెంట్లు, హోటల్స్ నుంచి ఆర్డర్స్ పెట్టుకొని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. మోతాదు మించితే ప్రతి ఒక్క ఆహార పదార్థం కూడా విషమే అవుతుంది. మరో విషయం ఏంటంటే.. కొన్ని ఆహార పదార్థాలను విడి విడిగా తింటేనే మంచిది. మిక్సింగ్ చేసి తింటే ఇబ్బంది పెట్టే అవకాశం కూడా ఉంటుందట. ప్రతి కూరగాయల నుంచి శరీరానికి ఏదో ఒక రకమైన హెల్ప్ అందుతుంటుంది.కానీ కొన్ని కలిపి చేయడం వల్ల మాత్రం నెగిటివ్ ఫలితాలు వస్తుంటాయి. ఇందులో భాగంగా టమాట పాలకూరను కలిపి వండవద్దు అంటారు కొందరు. ఇలా మిక్స్ చేసి వండితే రాళ్లు అవుతాయని కూడా అంటారు. అంతేకాదు ఎగ్ కర్రీ వండినా అందులో టమాటాను కలపవద్దు అంటారు. మరి పాలకూర టమాట కలిపి వండడం వల్ల నిజంగానే ఏమైనా సమస్యలు వస్తాయా? ఓ సారి చదివేసేయండి. పాలకూర టమాట తినడం వల్ల ఎలాంటి నష్టం జరగదు అంటున్నారు నిపుణులు. ఆక్సలేట్స్ ఎక్కువగా ఉంటే కిడ్నీలో స్టోన్స్ వస్తాయి అంటారు నిపుణులు. అయితే పాలకూరలో ఈ ఆక్సలేట్స్ 750 మి.గ్రాములు ఉంటే.. టమాటోలో 150 మి. గ్రాముల ఆక్సలేట్స్ ఉంటాయి. అందుకే పాలకూర టమాట తింటే రాళ్లు వస్తాయి అంటారు. అయితే పాలకూర టమాట వండటం వల్ల 80 శాతం ఆక్సలేట్స్ నశిస్తాయట. కేవలం 40–50 శాతం మాత్రమే పేగుల్లోకి వెళ్తాయట. 60 శాతం విసర్జనలో వెళ్లిపోతాయి అంటారు నిపుణులు. రక్తం లోపలికి వెళ్లినా కూడా లివర్ హ్యాండిల్ చేసి అందులో 15 శాతం బ్లడ్ లోకి పంపిస్తుందట. మిగతా వాటిని మోషన్ ద్వారా బయటకు పంపిస్తుందట. ఈ మెకానిజం వల్లనే పాలకూర టమాట తిన్నా కూడా రాళ్లు రావు అంటున్నారు నిపుణులు. అందుకే స్టోన్స్ ఉన్న వారు అయినా లేని వారు అయినా కూడా ఈ పాలకూర టమాటాను తినవచ్చు. మిక్సింగ్ చేసి తింటే ఇబ్బంది పెట్టే అవకాశం కూడా ఉంటుందట. ప్రతి కూరగాయల నుంచి శరీరానికి ఏదో ఒక రకమైన హెల్ప్ అందుతుంటుంది.కానీ కొన్ని కలిపి చేయడం వల్ల మాత్రం నెగిటివ్ ఫలితాలు వస్తుంటాయి.

కిరణ్ అబ్బవరం యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ నుంచి వెండితెరపైకి హీరోగా వచ్చాడు. రాజా వారు రాణి వారు అంటూ మొదటి సినిమాతో అందరినీ ఆకట్టుకున్నాడు. హీరో మాత్రమే కాకుండా కిరణ్ అబ్బవరంలో ఓ కథకుడు కూడా ఉన్నాడు. అయితే కిరణ్ అబ్బవరం మాస్ ఇమేజ్ అంటూ రకరకాల సినిమాలు చేస్తూ వచ్చాడు. మధ్యలో కొన్ని ప్రయోగాలు కూడా చేశాడు. కానీ ఏది కూడా కిరణ్ అబ్బవరంకు కలిసి రాలేదు. ఎస్ ఆర్ కళ్యాణమండపం మాత్రం లాభాలను తీసుకొచ్చిందని

# హీరోలా ఉన్నావ్ అన్నా!..



చెబుతుంటారు. వినరో భాగ్యము విష్ణుకథ పర్వాలేదని అంటుంటారు. ఇక ఏ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగ్గ విజయం సాధించలేదు. సెబాస్టియన్, మీటర్ వంటివి అయితే డిజాస్టర్లుగా నిలిచాయి. ఇలా కిరణ్ అబ్బవరం ప్రతీ సారి ప్రేక్షకుల మీద దాడి చేస్తుండటం తో.. ట్రోలింగ్ ఎక్కువగా జరుగుతుంటుంది. కిరణ్ అబ్బవరం, ఆది సాయి కుమార్‌ల మీద నెట్టింట్లో దారుణంగా ట్రోల్ జరుగుతుంటు ంది. మరీ ముఖ్యంగా కిరణ్ అబ్బవరంను అయితే నెటిజన్లు ఆడేసుకుంటారు. హీరోలా ఉన్నావ్ అన్నా అంటూ ఏడిపిస్తుంటారు. తాజాగా కిరణ్ అబ్బవరం తన రూల్స్ రంజన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన ఫాలోవర్లతో ట్విట్టర్‌లో చిట్ చాట్ చేశాడు. హీరోలా ఉన్నావ్ అన్నా అని ఓ నెటిజన్ సెటైర్ వేశాడు. హీరోలా లేకపోయినా పర్లేదు.. మీలో ఒకడిలా ఉంటే చాలు అని చాలా కూల్‌గా రిప్లై ఇచ్చాడు కిరణ్ అబ్బవరం. రూల్స్ రంజన్ హిట్ అయ్యాక నీకు రతిక లాంటి అమ్మాయితో పెళ్లి కావాలని కోరుకుంటున్నా అని శాపం పెట్టేశాడు ఓ నెటిజన్. దానికి ఇలా రిప్లై ఇచ్చాడు. బాబు గుడుండా.. నా మీద నీకు ఎందుకంత పగ.. పెళ్లైతే చేసుకుంటా గానీ.. ఎలాంటి అమ్మాయి వస్తుందో చూడాలి.. అని ఫన్నీగా చెప్పేశాడు కిరణ్ అబ్బవరం. అంటే.. కిరణ్ అబ్బవరం.. బిగ్ బాస్ షోను, అందులో రతికను బాగానే ఫాలో అయినట్టుగా కనిపిస్తోంది. ప్యాన్ ఇండియా స్టార్ కిరణ్ అబ్బవరం అని మరో నెటిజన్ ట్రోల్ చేస్తే.. ఎంతో కూల్‌గా ఆన్సర్ ఇచ్చాడు. ముందు ఇక్కడ నిరూపించుకుని.. ఆ తరువాత అక్కడ చూద్దాం.. ఇప్పుడే అంత సీన్ లేదన్నట్టుగా చెప్పుకొచ్చాడు. ఇక తన మీద ట్రోలింగ్, ఈ నెగెటివిటీ ఎక్కువగానే ఉంటుందని, అయినా తాను దాన్ని పట్టించుకోవడం లేదని, తనకు అండగా అభిమానులున్నారని చెప్పుకొచ్చాడు. ప్రయోగాలు చేస్తే ఫెయిల్ చేశారని, అయినా కూడా ఈ సారి మంచిగా మళ్లీ ప్రయత్నిస్తాను అని అన్నాడు.

# స్కంద జోరు వీకెండ్‌లో



ఉస్తాద్ రామ్ నటించిన స్కంద జోరు వీకెండ్‌లో ఓ మోస్తరుగా కనిపించింది. పోటీలో ఏ చిత్రం లేకపోవడంతో స్కందకు బాగా కలిసి వచ్చింది. అందుకే రోటీన్ రొడ్డ సినిమా అని ఎంత ట్రోలింగ్ వచ్చినా.. స్కందకు ఓ మాదిరి కలెక్షన్లు వచ్చాయి. స్కందతో పాటు రిలీజ్ అయిన పెదకాపు, చంద్రముఖి 2లు బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపించలేకపోయాయి. కానీ స్కంద మాత్రం లాంగ్ వీకెండ్‌ను బాగా వాడుకుంది. యాభై కోట్ల గ్రాస్‌ను క్రాస్ చేసింది. ఇక వీక్ డేస్‌లో స్కంద ఎలా ఉంటుందో అని ఊహించుకున్నవారికి షాక్ కొట్టేలా ఆరో రోజు కలెక్షన్లు ఉన్నాయి. స్కందకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి రోజు 8.7 కోట్ల షేర్ వచ్చింది. రామ్, బోయపాటి కాంబోకి ఉన్న క్రేజ్ వల్ల ఆ రేంజ్‌లో ఓపెనింగ్స్ వచ్చాయి. అదే రామ్ కెరీర్‌కు బెస్ట్ ఓపెనింగ్స్ కూడా. అయితే దారుణమైన టాక్ వల్ల రెండో రోజు సగానికి పైగా పడిపోయింది. రెండో 3.5 కోట్ల రేంజ్‌లో వచ్చింది. మూడో రోజు కాస్త తగ్గి 3.3 కోట్లు వచ్చాయి. ఆదివారం కావడంతో నాలుగో రోజు కాస్త పెరిగింది. 4.5 కోట్ల షేర్ వచ్చింది. ఐదో రోజు గాంధీ జయంతి కావడంతో పర్వాలేదనిపించేలా 2.84 కోట్లు వచ్చాయి. అక్కడి వరకు అంతా బాగానే ఉంది. అలా ఐదు రోజుల్లోనే యాభై కోట్ల గ్రాస్ మార్క్ కొట్టింది. దాదాపు 25 నుంచి 27 కోట్ల షేర్ రాబట్టింది. బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే 47 కోట్ల షేర్ రాబట్టాల్సి ఉంటుంది. ఇలా బ్రేక్ ఈవెన్‌కు చాలా దూరంలోనే ఉండిపోయింది. లాంగ్ వీకెండ్ కాబట్టి ఆ మాత్రం కలెక్షన్లు వచ్చాయి. వీక్ డేస్‌లో ఈ సినిమాకు దారుణమైన వసూళ్లు ఉంటాయని అంతా అనుకున్నారు. అనుకున్నట్టుగానే జరిగింది. ఆరో రోజు స్కందకు 1.2 కోట్ల షేర్ మాత్రమే వచ్చింది.

అలా ఈ ఆరు రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో 24.04 కోట్ల షేర్ రాగా.. ప్రపంచ వ్యాప్తంగా చూసుకుంటే.. 30.12 కోట్ల షేర్ రాబట్టింది. ఇంకా పదిహేడు కోట్ల షేర్ రాబడితే.. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అవుతుంది. ఆ తరువాత ఏమైనా వసూళ్ చేస్తే అది లాభాల కిందకు వెళ్తుంది. మరి స్కంద బ్రేక్ ఈవెన్ అవ్వడమే కష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి టైంలో స్కంద లాభాలను తెచ్చి పెడుతుందా? లేదా? అన్నది చూడాలి. స్కందకు దారుణమైన టాక్ వచ్చినా కూడా సీక్వెల్ తీయాలని బోయపాటి పట్టుదలతో ఉన్నాడట. మరి రామ్ ఒప్పుకుంటాడా? లేదా? అన్నది చూడాలి.

# నీ సంతోషమే నాకు ముఖ్యం..



మంచు మనోజ్ సోషల్ మీడియాలో బాగానే యాక్టివ్‌గా ఉంటాడు. ఆ మధ్య తన పర్సనల్ కారణాలతో సినిమాలకు దూరమయ్యా డు. సోషల్ మీడియాలోనూ అంత యాక్టివ్‌గా ఉండేవాడు కాదు.కానీ ఏదైనా సమ స్యలు తన దృష్టికి వస్తే మాత్రం రోడ్డెక్కి బాధితు లకు అండగా నిలబడు తుండేవాడు. మంచు మనోజ్ రెండో పెళ్లి మీద ఎన్ని రకాల రూమర్లు వచ్చాయో అందరికీ తెలిసిందే. ఆ రూమర్లే చివరకు నిజం అయ్యాయి. భూమా మౌనికను పెద్దల సమక్షంలో ఘనంగా వివాహామాడాడు మంచు మనోజ్. భూమా మౌనిక కొడుకు ధైరవ్‌ను మనస్ఫూర్తిగా మనోజ్ దగ్గరకు తీసుకున్నాడు. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అంటే ఇదే అని ఫన్నీగా మీడియా ముందే కామెంట్ చేశాడు. తాజాగా మంచు మనోజ్ తన భార్యకు ప్రత్యేకంగా బర్త్ డే విషెస్ చెప్పాడు. భూమా మౌనిక మీద తనకున్న ప్రేమను ఇలా ట్వీట్ రూపంలో చెప్పేశాడు. ఆ ట్వీట్‌లో ఏం ఉందంటే..

హ్యాపీ బర్త్ డే మున్నిలు.. ఈ రోజు నీ పుట్టిన రోజు. ఈ సందర్భంగా నాకు నీ మీదున్న ప్రేమను వ్యక్తపర్చాలని అనుకుంటున్నాను.. నా జీవితానికి నువ్వే వెలుగు.. నువ్వే నా ప్రేమ.. మనల్ని కలిపిన ఈ కాలంకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.. నువ్వే నా జీవితంలో నవ్వులు పంచావ్.. సంతోషాన్ని తీసుకొచ్చావ్.. నీ ప్రేమ, నీ కేరింగ్ గురించి మాటల్లో చెప్పలేను.. నా జీవితంలోకి, ధైరవ్ జీవితంలోకి నువ్వు రావడం మా అదృష్టం.. నువ్వెంతో దయామయురాలివి.. అందరినీ నవ్విస్తుంటావ్.. నీ చుట్టు పక్కల ఉన్నవారిని సంతోషంగా ఉంచాలని చూస్తావ్.. నువ్వెప్పుడూ ఇలానే ఆనందంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను.. నీకెప్పు డూ మంచే జరగాలి.. మై లవ్.. నీపై ఎప్పుడూ అనంతమైన ప్రేమను కురిపిస్తూనే ఉంటాను.. నీ సంతోష మే నాకు ముఖ్యం.. దాని కోసం నేను ఏదైనా చేస్తాను.. ఈ బర్త్ డే సందర్భంగా మనం గడిపిన మధుర క్షణాలను నెమరు వేసుకుంటున్నాను.. హ్యాపీ బర్త్ డే.. మై డార్లింగ్ వైఫ్.. నువ్వెప్పుడూ ఇలానే నవ్వుతూ, సంతోషంగా ఉండాలి.. ధైరవ్, జోయా, మనుల తరుపున హ్యాపీ బర్త్ డే అని మనోజ్ ట్వీట్ వేశాడు.



# మళ్లీ భయపెడుతున్న ఓంకార్ అన్నయ్య

తమిళ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె తెలుగులో చేసినవి ఇంచుమించు నెగిటివ్ పాత్రలే. అలాగే, ఆమె చేసినవి కమర్షియల్ సినిమాలే. అయితే, ఇప్పుడు ఒక హారర్ సిరీస్‌తో అలరించడానికి ఆమె సిద్ధమయ్యారు. 'రాజుగారి గది' లాంటి హారర్ మూవీతో తెలుగు ప్రేక్షకులను భయపెట్టిన దర్శకుడు ఓంకార్.. ఇప్పుడు వరలక్ష్మీ శరత్‌కుమార్‌తో 'మ్యాన్షన్ 24' అనే హారర్ వెబ్ సిరీస్‌తో చేశారు. ఈ వెబ్ సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాంలో ఈనెలలోనే స్ట్రీమింగ్ కానుంది. 'జీనియస్' సినిమా ద్వారా తనలోని దర్శకుడిని పరిచయం చేశారు ప్రముఖ టీవీ హోస్ట్ ఓంకార్. పిల్లలు, పెద్దలు అందరితోనూ ఓంకార్ అన్నయ్య అని పిలిపించుకుంటూ బుల్లితెరపై తనకంటూ ఒక స్టార్ ఇమేజ్‌ను సంపాదించుకున్నారు. అయితే, తనలోని రచయితను, దర్శకుడిని ప్రేక్షకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో 'జీనియస్' సినిమా ద్వారా వెండితెర ప్రయాణం మొదలుపెట్టారు. తొలి సినిమాతో ఆకట్టుకున్నారు. ఇక 'రాజుగారి గది' సినిమాతో దర్శకుడిగా ఓంకార్ పేరు మారుమోగింది. ఈ సినిమాతో ప్రేక్షకులను తెగ భయపెట్టారు ఓంకార్.

ఆయన అక్కడితో ఆగిపోలేదు. నాగార్జున, సమంత లాంటి స్టార్లతో 'రాజుగారి గది 2' తీసి సక్సెస్ అయ్యారు. ఇక 2019లో 'రాజుగారి గది 3'తో వచ్చారు. ఈ మూడు సినిమాలు ఓంకార్‌లోని హారర్ డైరెక్టర్‌ను ప్రేక్షకులకు చూపించాయి. అయితే, ఈ హారర్ ప్రయాణాన్ని ఆయన ఇంకా ఆపలేదు. ఇప్పుడు 'మ్యాన్షన్ 24' అనే వెబ్ సిరీస్‌తో ఇంట్లోనే బుల్లితెరపై ప్రేక్షకులను భయపెట్టబోతున్నారు ఓంకార్. వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఈ సిరీస్ ట్రైలర్‌ను ఈరోజు విడుదల చేశారు. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ఓంకార్ అన్నయ్య మళ్లీ బాగా భయపెట్టేస్తారని అర్థమైపోయింది. వరలక్ష్మీ శరత్‌కుమార్ 'మ్యాన్షన్ 24' ట్రైలర్.. ఓంకార్ అన్నయ్య మళ్లీ భయపెట్టేశాడు! భారీ తారాగణంతో ఈ సిరీస్‌ను ఓంకార్ రూపొందించారు. సత్యరాజ్, అవికా గోర్, బిందుమాధవి, సిమ్రన్, రావు రమేష్, జయప్రకాశ్, తులసి, రాజీవ్ కనకాల వంటి ప్రముఖ నటీనటులతో పాటు అర్చన జియోస్, అమర్‌దీప్, అయ్యప్ప పి శర్మ, మానస్, 'బాహుబలి' ప్రభాకర్, అభినయ, విద్యుల్లేఖ రామన్, 'ఛత్రపతి' శేఖర్, సూర్య, నళిని, శరధ్ దంగర్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సిరీస్ అక్టోబర్ 17 నుంచి డిస్నీంహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఓక్ ఎంటర్‌టైన్మెంట్‌పై ఓంకార్, అశ్విన్ బాబు, కళ్యాణ్ చక్రవర్తి ఈ సిరీస్‌ను నిర్మించారు. వికాశ్ బాదిషా సంగీతం సమకూర్చారు. బి.రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందించారు. అశోక్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్. ఆదినారాయణ ఎడిటర్. దేశద్రోహిగా ముద్రపడిన తండ్రి నిజాయతీని నిరూపించే కూతురిగా వరలక్ష్మీ శరత్‌కుమార్ ఈ సిరీస్‌లో కనిపించనున్నారు. ఆమె తల్లిదండ్రులుగా సత్యరాజ్, తులసి నటించారు. దేశ సంపదను దోచుకుని కనిపించకుండా పోయాడని సత్యరాజ్‌పై నిందపడుతుంది. ఆయన మ్యాన్షన్ హౌస్‌కి వెళ్లిన తరవాత నుంచీ కనిపించకుండా పోవడాన్ని వరలక్ష్మీ శరత్‌కుమార్ ట్రైలర్‌లో హైలైట్ చేస్తున్నారు. అయితే, అక్కడికి వెళ్లి కనిపించకుండా పోయారంటే ఇక ఆయన గురించి మరిచిపోవడం మంచిదని పోలీసులు సహా అందరూ సలహా ఇవ్వడం ఆసక్తికర అంశం. ఇంతకీ ఆ మ్యాన్షన్ హౌస్‌లో ఏముంది? తన తండ్రి ఏమయ్యారు? అనే విషయాలు కనుక్కోవడానికి వరలక్ష్మీ శరత్‌కుమార్ మ్యాన్షన్ హౌస్‌కి వెళ్లారు. ఆ తరవాత హారర్ థ్రిల్లర్‌ను మనం సిరీస్‌లో చూడాల్సిందే.



# ఇంటర్వ్యూ లోంచి లేచివెళ్లిన హెబ్బా పటేల్

హెబ్బా పటేల్ తెరపై సక్సెస్ కొట్టి చాలా కాలమే అవుతోంది. కుమార్ 21ఎఫ్ ఆమె ఖాతాలో పడ్డ బ్లాక్ బస్టర్ హిట్. ఆ తరువాత ఎక్కడికి పోతావు చిన్నవాడా అనే చిత్రం కూడా హిట్టే. అయితే ఆమెకు ఎక్కువగా బోల్డ్ పాత్రలు వచ్చాయి. యూత్ అండ్ బోల్డ్ కంటెంట్‌లోనే నటించింది. ఆఫర్లు వస్తూనే ఉన్నా.. విజయం మాత్రం దక్కడం లేదు. గత ఏడాది ఓదెల రైల్వే స్టేషన్ అంటూ ఓటీటీ ఆడియెన్స్‌ను ఆశ్చర్యపరిచింది. అందులో హెబ్బా డీగ్లామర్‌గా కనిపించి, నటించి మెప్పించింది. ప్రస్తుతం గ్రేట్ ఇండియన్ సూసైడ్ అనే వెబ్ సిరీస్‌తో ఇప్పుడు ఆహాలో సందడి చేయబోతోంది. అక్టోబర్ 6 నుంచి హెబ్బా పటేల్ సందడి షురూ కాబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్ కోసం మీడియా ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఓ యూట్యూబర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. అందులో సదరు యాంకర్ అడిగిన ప్రశ్న, వేసిన క్వశ్చన్‌కు హెబ్బా పటేల్ కాస్త హర్ట్ అయినట్టుగా కనిపిస్తోంది. సదరు యాంకర్ ఇంటర్వ్యూ మొదలుపెట్టడమే మూడ్ బాగుందా? అంతా ఓకేనా? అంటూ కాస్త సెటైరికల్‌గా అన్నాడు. మీరేం అన్నారో నాకు అర్థం కావడం లేదు అని హెబ్బా పటేల్ కాస్త హర్ట్ అవుతూ అనేసింది. అర్థం అవ్వడం లేదు అని అంటున్నా.. మూడ్ బాగుందా? అంతా ఓకేనా? అన్నట్టుగా సదరు యాంకర్ అడుగుతూనే వచ్చాడు. దీంతో తనకు ఏదో తేడా కొట్టినట్టు అనిపించిందేమో. ఈ ఇంటర్వ్యూ నేను చేయను అని వెళ్లిపోయింది. ఆ విజువల్స్ ఇప్పుడు బాగానే వైరల్ అవుతున్నాయి. అయితే ఇదేమీ ప్రాంక్ కాదని, నిజంగానే జరిగిందని తెలుస్తోంది. ప్రాంక్ కోసం ఇలా చేసి ఉంటారులే అని కొంత మంది కొట్టిపారేస్తున్నారు. కానీ ఇది నిజంగానే జరిగిందని అంటున్నారు. ఈ వీడియో ఎలా బయటకు వచ్చింది? అని ఇంకొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# వేడుకున్న సితార ఘట్టమనేని

ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం సందర్భంగా సితార, మహేష్ బాబులు తమ ఇంట్లో ఉన్న పెట్ స్నూపీ గురించి పోస్ట్ వేశారు. సితార అయితే పెట్స్ గురించి చెబుతూ.. ప్రతీ ఒక్కరూ ఒక పెట్‌ను అడాప్ట్ చేసుకోమని కోరింది. సూపర్ స్టార్ మహేష్ బాబు కూతురు సితార ఈ మధ్య నెట్టింట్లో ఎక్కువగా ట్రెండ్ అవుతోంది.సితారకు ఇష్టమైన పెట్ ప్లూటో మరణించిన తరువాత ఎంతలా కుంగిపోయిందో అందరికీ తెలిసిందే. మహేష్ బాబు సైతం ప్లూటో మరణంతో తెగ బాధపడ్డాడు. ప్లూటో మరణించిందని షూటింగ్ కూడా క్యాన్సిల్ చేశాడనే టాక్ నెట్టింట్లో ఎక్కువగా వినిపించింది. అయితే ప్లూటో మరణించిన కొన్ని రోజులకే మళ్లీ స్నూపీ అనే పెట్‌ను తీసుకొచ్చారు. తాజాగా స్నూపీ గురించి సితార సీక్రెట్లు చెప్పింది. ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవ సందర్భంగా సితార వేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. మనుషులకు ప్రేమ గురించి ఆ పెట్స్ నేర్పుతాయి.. బ్లూ క్రాస్ యానిమల్ షెల్టర్ సంస్థ స్నూపీని రెస్క్యూ చేసింది.. అక్కడి నుంచి మా జీవితాల్లోకి స్నూపీ వచ్చింది.. మాకు ఎంతో ప్రేమను, బంధాన్ని పంచుతోంది.. ఆపదలో ఉన్న వీధి కుక్కలను ప్రతీ ఒక్కరూ దత్తత తీసుకోవాలని అందరినీ కోరుతున్నాను.. బయట ఇలాంటి స్నూపీలు ఎన్నో ఉన్నాయి.. ఎవరో ఒకరు వాటికి కొత్త జీవితాన్ని ఇస్తారని ఎదురుచూస్తున్నాయి.. మీరు ఎప్పుడైనా ఒక్క కుక్కను అయినా కాపాడారా?.. నేను వాటిని చూడాలని అనుకుంటున్నాను.. స్టోరీలో పెట్టి నన్ను ట్యాగ్ చేయండి అని సితార కోరింది.ఇక మహేష్ బాబు సైతం జంతు సంక్షేమ దినోత్సవం సందర్భంగా స్నూపీ గురించి పోస్ట్ వేశాడు. ఆ పెట్ ఫోటోను షేర్ చేస్తూ.. స్నూపీ వల్ల మా జీవితం రోజురోజు కూ ఎంతో వెలిగిపో తోంది అని చెప్పుకొచ్చాడు.




# ఎవ్వడూ వాడి దగ్గరలోకి కూడా రాడు




చూసిన ఎవ్వరైనా అచ్చం మేనమామను దిగిపోయాడు అనకమానరు. అంతలా మహేష్ బాబు పోలికలు చరిత్‌లో కనిపిస్తున్నాయి. ఈ కుర్రాడికి అప్పుడే ఇన్‌స్టాగ్రామ్‌లో బోలెడంత ఫాలోయింగ్. నాన్నలోని ఫిట్‌నెస్.. మావయ్యలోని క్యూట్‌నెస్ కలిసి పుట్టేసినట్టుంటాడు చరిత్. ఇక హీరోగా లాంచ్ అవ్వడానికి ఇప్పటి నుంచే చరిత్‌కు ట్రైనింగ్ ఇప్పించేస్తున్నారు తండ్రి సుధీర్ బాబు. చరిత్ చేసే కొన్ని విన్యాసాలకు సంబంధించిన వీడియోలు ఇప్పటికే సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. పెద్ద కొడుకు చరిత్ మానస్ సినిమా కెరీర్ మీద హీరో సుధీర్ బాబు చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇప్పటికే పలు సినిమాల్లో బాలనటుడిగా కనిపించిన చరిత్.. ప్రస్తుతం హీరోగా లాంచ్ కావడానికి సిద్ధమవుతున్నాడు. కొడుక్కి అన్ని రకాల శిక్షణలు ఇప్పిస్తున్నారు సుధీర్ బాబు. ఇప్పటికే చరిత్ చేసిన కొన్ని విన్యాసాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవి చూసిన చాలా మంది ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరో రెడీ అని కామెంట్లు పెట్టారు. మరోవైపు, మేనమామ మహేష్ బాబు పోలికలు స్పష్టంగా కనిపిస్తుండడం ఈ కుర్రాడికి ఉన్న మరో ప్లస్. నవ్వు, నడక, ఆహార్యం.. అన్నింటిలోనూ మేనమామను పోలేశాడు చరిత్. చరిత్ సినిమా హీరోగా పరిచయం అవ్వనున్నట్టు ఇప్పటికే సుధీర్ బాబు స్పష్టం చేశారు. అయితే, నిన్న జరిగిన 'మామా మశ్చీం ద్ర' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కొడుకు ఆరం గేట్రం గురించి మరోసారి మాట్లా డారు. 'మామా మశ్చీంద్ర' సినిమాలో చరిత్ కూడా నటించాడు. దీంతో అతడి ప్రస్తావన తీసుకొచ్చిన సుధీర్ బాబు.. 'ట్రైలర్‌లో ఫస్ట్ వచ్చిన ఒకడు, వాడు మా అబ్బాయి. వాడికి థాంక్స్ చెప్తే బాగోదు. ఎక్కడికెళ్లినా ఇంటర్వ్యూల్లో చరిత్ గురించి చెప్పండి అని అడుగుతున్నారు. మూడు సంవత్స రాల్లో వస్తాడు. ఒక తుఫాన్ వస్తుంది.. రెడీ అయిపోండి మీరందరూ. సాలిడ్‌గా కష్టపడుతున్నాడు. ఇదేలెక్క మూడు సంవత్సరాలు కష్టపడితే ఇక ఎవ్వడూ దగ్గర్లోకి కూడా రాడు. అందరికీ దిమ్మ తిరిగిపోతుంది కచ్చితంగా' అంటూ వ్యాఖ్యానించారు. ఇక తన సినిమా గురించి సుధీర్ బాబు మాట్లాడుతూ..

లావుగా ఉండే క్యారెక్టర్‌కు ప్రోస్తెటిక్ మేకప్ బాగోలేదని కొందరు విమర్శిస్తున్నా రని, ప్రేక్షకులకు అంత లోతుగా చూడరని, విమర్శకులు సైతం భూతద్దాలు పెట్టి చూడకుం డా సాధారణ ప్రేక్షకుల మాదిరి గానే సినిమా చూడాలని విజ్ఞప్తి చేశారు. 'దుర్గ క్యారెక్టర్ ప్రోస్తెటిక్ సరిగా లేదు అంటూ నెగిటి వ్‌గా ఒక మీమ్ వచ్చింది. నేను మామూ లుగా మీమ్‌లు చూడ ను. కానీ నాకే ట్యాగ్ చేసి ఆ మీమ్ పెట్టారు. ఆ మీమర్‌కి, క్రిటిక్స్ అందరికీ ఒక మాట చెప్పాలని అనుకుంటున్నాను. భూతద్దంతో సినిమా చూడొద్దు సర్. ఆడియన్స్ భూతద్దంతో సినిమా చూడరు. ఆ భూతద్దం తీసేసి ఆడియన్స్‌లా చూడండి' అని సుధీర్ బాబు అన్నారు. దుర్గ క్యారెక్టర్‌కు వేసిన ప్రోస్తెటిక్ మేకప్ ఎంత పర్ఫెక్ట్‌గా ఉందో చెప్పడానికి సుధీర్ బాబు ఒక ఉదాహరణ కూడా చెప్పారు.

# కస్తూరి రిప్లై ఇదే



బుల్లితెరపై గృహలక్ష్మీ సీరియల్‌లో తులసి పాత్రలో కస్తూరీ శంకర్ ఇప్పుడు అందరినీ మెప్పిస్తోంది. వెండితెరపై ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన కస్తూరీ శంకర్.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టేసింది. బుల్లితెర, ఓటీటీ, సినిమాలు అంటూ ఇలా అన్ని రకాలుగా బిజీ అవుతోంది. ఆమె సోషల్ మీడియాలో చేసే కామెంట్లు, ఓ టాపిక్ మీద ఇచ్చే విశ్లేషణ, అనాలిసిస్‌లు బాగానే ఫాలో అవుతుంటారు నెటిజన్లు. ఈ క్రమంలోనే బిగ్ బాస్ ఏడో సీజన్ గురించి అడిగినట్టున్నారు. ఈ వారమే బిగ్ బాస్ ఏడో సీజన్ తమిళంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. వనిత విజయ్ కుమార్ కూతురు జోవిక ఈ ఏడో సీజన్లో ఎంట్రీ ఇచ్చింది. ఇక తన కూతురు ఎంట్రీ ఇవ్వడంతో ప్రతీ ఒక్క అప్డేట్ ఇస్తూ ట్వీట్ల వర్షాన్ని కురిపిస్తోంది వనిత. వనిత, కస్తూరీ శంకర్‌లు ఒకే సీజన్‌లో బిగ్ బాస్ ఇంట్లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఒకే ఇంట్లో ఇలా మందిని పంపించి.. వారి ఆర్టిఫిషియల్ ఫీలింగ్స్‌ను చూపించే షోను నేను చూడటం లేదు.. నాకు అంత టైం, ఇంట్రెస్ట్, ఓపిక లేదు.. మా ఇంట్లో టీవీ కూడా ఉండదు.. నాకంటూ పనులు, బాధ్యతలున్నాయి.. నేను బిగ్ బాస్ షోను చూడటం లేదు అని అందరికీ క్లారిటీ ఇచ్చింది కస్తూరీ శంకర్. దీనిపై నెటిజన్లు ట్రోల్ చేయడం ప్రారంభించారు. బిగ్ బాస్ షోలోకి వెళ్లిన నువ్వు ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నావా? డబ్బుల కోసం షోకు వెళ్లావు కదా? మళ్లీ ఇప్పుడు ఇలా అంటున్నావా? అని అందరూ నానా రకాలుగా ట్రోల్స్ చేస్తున్నారు.


# డబ్బును సేవింగ్ బ్యాంకులో ఉంచుతున్నారా...?



మనిషి జీవితాన్ని నడిపించేది డబ్బు. ఉదయం లేచిందగ్గర్నుంచి రాత్రి వరకు ప్రతీ అవసరం డబ్బుతో కొనాల్సింది. డబ్బు ఒకరి దగ్గర ఎక్కువ, మరొకరి దగ్గరి తక్కువ ఉంటుంది.కానీ డబ్బు లేని మనిషి మాత్రం ఉండరు. చాలా మంది రోజూవారీ అవసరాలతో పాటు భవిష్యత్ లో ఏదైనా అత్యవసం ఏర్పడినప్పుడు ఖర్చుపెట్టడానికి సేవింగ్స్ చేస్తారు. ఈ సేవింగ్ వివిధ రకాలుగా ఉంటుంది. కొంత మంది సంపాదించిన డబ్బును ఇంట్లో డబ్బాల్లోనూ, బీరువాల్లోనూ, బ్యాంకుల్లో సేవింగ్స్ చేస్తూ ఉంటారు. బ్యాంకుల్లో సేవింగ్ చేయడం వల్ల లాభం కంటే నష్టాలే ఎక్కువ. ఇది కొంచెం ఆశ్చర్యమనిపించినా.. ఈ విషయం తెలిస్తే డబ్బును బ్యాంకుల్లో అస్సలు సేవ్ చేయరు. మరి ఆ వివరాల్లోకి వెళితే. ఈ భూమ్మీద ఇద్దరు వ్యక్తులు ఒకే విధమైన పనిచేస్తారు. కానీ ఒకరు ఫైనాన్షినయల్ గా డెవలప్ అవుతారు. మరొకరు మాత్రం ఇంకా కష్టపడుతూనే ఉంటారు. దీనికి కారణం ఆ వ్యక్తికి ఉన్న అదృష్టం, దురదుష్టం అంటారు. ఒక వ్యక్తి జీవితం తన చేతుల్లోనే ఉందని అనుకున్నప్పుడు ఏ శక్తులైనా తన కిందికి రావాల్సిందే. అలాగే కొన్ని విషయాల్లో చాదస్తాన్ని వీడి ప్రణాళిక ప్రకారంగా ముందుకు వెళితే జీవితంలో సక్సెస్ అవుతారు.డబ్బు సేవింగ్ విషయంలోనూ కొస్త టెక్నిక్స్ ను యూజ్ చేస్తూ ముందుకు వెళ్లాలి. అప్పుడే సంపాదించన డబ్బు కంటే రెట్టింపు అవుతుంది. చాలా మంది డబ్బు సంపాదిస్తూ కేవలం ఇంట్లో, బ్యాంకులో సేవింగ్స్ చేస్తుంటారు. చిట్టీలు, మ్యూచువల్ ఫండ్స్ లేదా ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భయపడుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల నష్టాలు ఉంటాయని అనుకుంటారు. కానీ జీవితంలో కొన్ని రోజులైనా మంచిగా ఉంటే చాలు.. ఆ తరువాత జీవితాంతం సుఖపడొచ్చు. అలాగే డబ్బును పెట్టుబడి పెట్టుకుంటూ పోతే చాలు.. ఎప్పటికైనా అది రెట్టింపు అవుతుంది. ఇంట్లో నిల్వ చేసిన డబ్బు 10 సంవత్సరాల తరువాత చూస్తే ఎంత సేవింగ్ చేశామో.. అంతే ఉంటుంది.


# బంగారం ధరలు రూ.లక్ష చేరుకుంటుందా?

బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో లక్ష రూపాయల వరకు పెరుగుతుందా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. గత కొన్ని వారాలుగా బంగారం ధరలు గరిష్ట స్థాయిలో పెరగడమే గానీ తగ్గడం లేదు. దీంతో ఇప్పట్లో బంగారం కొనడం కష్టమేనని వినియోగదారులు అంటున్నారు. నేడు దేశీయంగా బంగారం ధరలు ఎంత పెరిగాయి? ప్రస్తుత ధరలు ఎలా ఉన్నాయి? ఆ వివరాల్లోకి వెళితే.. బులియన్ మార్కెట్ ప్రకారం.. ఏప్రిల్ 11న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,100గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.72,120 గా ఉంది. ఏప్రిల్ 10న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.65,750తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి బుధవారంతో పోలిస్తే గురువారం రూ.350 పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,260 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.72,270 గా నమోదైంది.ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.66,100 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.72,120 పలుకుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.66,060 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,160తో విక్రయిస్తున్నారు. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.66,100 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.72,120తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.66,100తో విక్రయిస్తున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.72,120తో విక్రయిస్తున్నారు. బంగారం ధరలతో పాటు వెండి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గురువారం ఓవరాల్ గా కిలో వెండి రూ.86,600గా నమోదైంది. బుధవారం కంటే గురువారం ఢిల్లీ



వెండి ధరల ప్రకారం రూ.1100 పెరిగింది. న్యూ ఢిల్లీలో కిలో వెండి రూ.85,600గా ఉంది. ముంబైలో రూ.85,600, చెన్నైలో రూ.89,100, బెంగుళూరులో 84,100, హైదరాబాద్ లో రూ.89,100తో విక్రయిస్తున్నారు.

# రూ.402 లక్షల కోట్లకు మదుపర్ల సంపద...!




ఎఫ్ఎమ్సీజీ, ఇంధన, లోహ షేర్లు పరుగులు తీయడంతో, సెన్సెక్స్ తొలిసారిగా 75,000 పాయింట్ల ఎగువన ముగిసింది. నిఫ్టీ కొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదుచేసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 83.31 వద్ద స్తబ్దుగా ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.18% లాభంతో 89.58 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై నష్టపోగా, హాంకాంగ్ లాభపడింది. ఐరోపా సూచీలు రాణించాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం ఒక్కరోజే రూ.2.27 లక్షల కోట్లు పెరిగి తాజా గరిష్ఠమైన రూ.402 లక్షల కోట్ల (4.83 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,953.96 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ధోరణిలో ట్రేడైన సూచీ, ఇంట్రాడేలో 75,105.14 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 354.45 పాయింట్ల లాభంతో 75,038.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 111.05 పాయింట్లు పెరిగి 22,753.80 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 22,775.70 వద్ద రికార్డు గరిష్ఠాన్ని తాకింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ సురీందర్ చావ్లా రాజీనామా చేసిన నేపథ్యంలో మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు ఇంట్రాడేలో రూ.388 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 0.94% తగ్గి రూ.400.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.241.45 కోట్లు కోల్పోయి రూ.25,448.32 కోట్లుగా నమోదైంది. అగ్రో కెమికల్ సంస్థ బెస్ట్ అగ్రోలైఫ్ లిమిటెడ్ షేర్లు ఎన్ఎస్ఈలో నమోదయ్యాయి. బుధవారం ఎన్ఎస్ఈలో రూ.687.70 వద్ద ప్రారంభమైన షేరు, ఇంట్రాడేలో రూ.695 వద్ద గరిష్ఠాన్ని, రూ.665.35 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు రూ.675.05 వద్ద ముగిసింది. కంపెనీ షేర్లు ఇప్పటికే బీఎస్ఈలో నమోదయ్యాయి.


# హాట్.. హాట్ రికార్డులు 400 లక్షల కోట్లపైకి....



**ముంబై :** బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ తొలిసారి రూ.400 లక్షల కోట్ల ఎగువన ముగిసింది. గత ఏడాది జూలైలో రూ.300 లక్షల కోట్ల మార్కును తాకిన విషయం తెలిసిందే. కేవలం 9 నెలల్లోనే మదుపరుల సంపద రూ.100 లక్షల కోట్లు ఎగబాకడం గమనార్హం. సుమారు తొమ్మిదిన్నరేండ్ల క్రితం మొదటిసారి రూ.100 లక్షల కోట్ల మార్కును దాటిం ది. ఆ తర్వాత ఆరేండ్లకు రూ. 200 లక్షల కోట్లను చేరింది. అయితే రూ.200 లక్షల కోట్ల నుంచి రూ.300 లక్షల కోట్లను చేరడానికి రమారమీ రెండున్నరేండ్లే పట్టింది. హాట్.. హాట్ సమ్మర్‌ను దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు గరిష్ఠాలతో మరింత హీటెక్కించాయి. సోమవారం అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సరికొత్త స్థాయిలను అధిరోహించాయి. మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేయడంతో ఉదయం ఆరంభం నుంచే రికార్డుల మోత మోగిం ది. ఈ క్రమంలోనే గత ఇంట్రా-డే హై, క్లోజింగ్ హై రికార్డులు బద్దలై కొత్తవి నమోదయ్యాయి. సెన్సెక్స్ ఒకానొక దశలో 621.08 పాయింట్లు ఎగిసి తొలిసారి 74,869.30 స్థాయిని తాకింది. ఇదే సమయంలో నిఫ్టీ కూడా 183.60 పాయింట్లు ఎగబాకి మొదటిసారి 22,697.30 స్థాయిని చేరింది. రెండు సూచీలకూ ఇవే ఆల్‌టైమ్ ఇంట్రా-డే హై. కానీ ఆఖర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఈ ఉత్సాహం కాస్త చల్లబడింది. అయినప్పటికీ ఆల్‌టైమ్ క్లోజింగ్ హైల్లోనే సూచీలు స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 494.28 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 74,742.50 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 152.60 పాయింట్లు లేదా 0.68 శాతం పుంజుకొని గతంలో ఎప్పుడూ లేనట్టుగా 22,666.30 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కలిసొచ్చాయని నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక హెవీ వెయిట్ షేర్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. అలాగే మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ షేర్లు మెరిశాయి.

# భారత యూనికర్న్‌లలో స్తబ్దత హురున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్ట్

భారత స్టార్టప్‌లు వెనుకబడి పోతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని బిజెపి వర్గాలు చేస్తోన్న ప్రచారానికి స్టార్టప్‌ల పెరుగుదల భిన్నంగా ఉంది. 2023లో భారత్‌లో యూనికార్న్‌లు పెరగాల్సింది పోయి.. పైగా ఒక్కటి తగ్గింది. భారత్‌లో 2022లో మొత్తం 68 యూనికార్న్‌లుండేవని.. గతేడాది ఈ సంఖ్యలో ఒక్కటి తగ్గి 67గా నమోదయ్యిందని హురున్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ 2024 నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యధిక విలువ కోల్పోయిన వాటిలో భారత్‌కు చెందిన బైజూస్ టాప్‌లో ఉంది. అయితే.. ప్రపంచ దేశాల్లో మాత్రం భారత్ ర్యాంక్ యథాతథంగా మూడో స్థానంలోనే ఉందని పేర్కొంది. బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8300 కోట్లు) పైగా విలువ చేసే స్టార్టప్‌లను యూనికర్న్‌లుగా గుర్తిస్తారు. హురున్ రిపోర్ట్ ప్రకారం.. 2023లో ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 171 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను పొందాయి. ఏడాదిలో రెండు రోజులకు ఒక కొత్త యూనికార్న్‌లుగా మారాయి. ఈ ఏడాది జనవరి 1 నాటికి ప్రపంచవ్యాప్తంగా మొత్తంగా 1,453 యూనికార్న్‌లున్నాయి. 2022తో పోలిస్తే 7 శాతం పెరిగాయి. కొత్తగా అమెరికాలో 70, చైనాలో 56 సంస్థలు యూనికార్న్ స్థాయికి చేరాయి. దాంతో పాటు యుఎస్‌లో 21, చైనాలో 11 కంపెనీలు ఈ హోదా నుంచి తప్పుకున్నాయి. ఇతర దేశాల నుంచి 45 కొత్త అంకురాలు యూనికార్న్‌లుగా నమోదయ్యాయి. కంపెనీల విలువ ఆధారంగా హురున్ గ్లోబల్ ఇండెక్స్ విడుదల చేసిన జాబితాలో బైట్ డ్యాన్స్




(180 బిలియన్ డాలర్లు), స్పేస్ ఎక్స్ (100 బిలియన్లు), ఓపెన్ఎఐ, యాంట్ గ్రూప్, షీన్ తదితర అగ్రస్థానంలో ఉన్నాయి. టాప్ 10లో ఒక్క భారత కంపెనీ కూడా లేకపోవడం గమనార్హం. అమెరికా ప్రపంచంలోనే మొత్తం 703 యూనికార్న్‌లతో అగ్రస్థానంలో ఉంది. చైనా 340 యూనికార్న్‌లతో రెండో స్థానంలో, 53 యూనికార్న్‌లతో బ్రిటన్ నాలుగో స్థానంలో నిలిచాయి. బైజూస్ 2022లో దాదాపు రూ.1.80 లక్షల కోట్ల విలువను కలిగి ఉండగా.. గతేడాది జాబితాలోనే లేకుండా పోవడం గమనార్హం.

# హెూమ్‌లోన్ రుణ బాధలు వేధిస్తున్నాయా..? ఈ టిప్స్‌తో లోన్ సమస్యలు దూరం కావాల్సిందే..!




రెపో రేటులో మార్పు రుణ ఖర్చులను ప్రభావితం చేస్తుంది. హెూమ్ లోన్ రీపేమెంట్‌లను మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి గృహయజమానులు హెూమ్ లోన్ ఈఎంఐలను తగ్గించడానికి చురుకైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బ్యాలెన్స్ బదిలీ ఎంపికలను అన్వేషించడం నుంచి రుణదాతలతో చర్చలు జరపడం, వ్యూహాత్మక ముందస్తు చెల్లింపులు చేయడం వరకు పలు చర్యలు తీసుకోవడం ద్వారా రుణ బాధల నుంచి రక్షణ పొందవచ్చు. రెపో రేటు విషయంలో ఆర్‌బీఐ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు విషయంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మీ హెూమ్ లోన్ ఈఎంఐ త్వరలో తగ్గే అవకాశం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. రెపో రేటులో మార్పు రుణ ఖర్చులను ప్రభావితం చేస్తుంది. హెూమ్ లోన్ రీపేమెంట్‌లను మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి గృహయజమానులు హెూమ్ లోన్ ఈఎంఐలను తగ్గించడానికి చురుకైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బ్యాలెన్స్ బదిలీ ఎంపికలను అన్వేషించడం నుంచి రుణదాతలతో చర్చలు జరపడం, వ్యూహాత్మక ముందస్తు చెల్లింపులు చేయడం వరకు పలు చర్యలు తీసుకోవడం ద్వారా రుణ బాధల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ నేపథ్యంలో హెూమ్ లోన్ ఈఎంఐలను తగ్గించుకోవడానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఓ సారి తెలుసుకుందాం.

**రెపో రేటుతో ఈఎంఐ ప్రభావితం**

రెపో రేటు అనేది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సాధారణంగా బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని నిర్వహించడానికి వాణిజ్య బ్యాంకులకు స్వల్పకాలిక రుణాలు ఇచ్చే రేటు. ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు, బ్యాంకులు తక్కువ ధరకు డబ్బు తీసుకోవచ్చు.

# మెగా స్పెక్ట్రమ్ వేలం! అమ్మకానికి కొత్త బ్యాండ్లు



**న్యూఢిల్లీ :** అత్యధిక ఫ్రీక్వెన్సీ స్థాయిలో మూడు కొత్త స్పెక్ట్రమ్ బ్యాండ్ల వేలానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం కాబోతున్నది. ఈ మేరకు ఇటీవలే టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్.. భాగస్వాముల అభిప్రాయాలను కోరింది. ఇప్పటిదాకా 37-37.5 గిగాహెట్జ్, 37.5-40 గిగాహెట్జ్, 42.5-43.5 గిగాహెట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్లలో స్పెక్ట్రమ్‌ను వేలం వేయలేదు. దీంతో వీటి ధర, పరిమాణం, చెల్లింపు విధానాలు, చెల్లుబాటు కాలం, కేటాయింపులకు సంబంధించిన నిబంధనలు తదితర అంశాలపై టెలికం సంస్థలతో ట్రాయ్ సంప్రదింపులు చేస్తున్నదని ఓ అధికారిక ప్రకటన విడుదలైంది. అంతా కుదిరితే ఈ కొత్త బ్యాండ్లలో ఏకంగా 4,000 మెగాహెట్జ్ స్పెక్ట్రమ్ వేలానికి వస్తుంది. భవిష్యత్తులో 5జీ, 6జీ మొబైల్ సర్వీసుల కోసం ఇది అందుబాటులో ఉంటుంది. 37-37.5 గిగాహెట్జ్ బ్యాండ్‌లోని రేడియో తరంగాలు మొబైల్ ఫోన్ సేవల కోసమే ఉంటుండగా, 37.5-40 గిగాహెట్జ్, 42.5-43.5 గిగాహెట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్లలోని స్పెక్ట్రమ్.. మొబైల్ సర్వీసులతోపాటు, శాటిలైట్ గేట్‌వే లింక్స్‌కూ వాడనున్నారు.

# రిషి సునాక్ కీలక నిర్ణయం.. భారతీయ కుటుంబాలకు షాక్




లండన్ : బ్రిటన్ ప్రభుత్వం కుటుంబ వీసా నిబంధనలను కటుతరం చేసింది. బ్రిటన్‌లో శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వారు భారతీయ సంతతివారైనా ఇతరులైనా తమ కుటుంబ సభ్యులను బ్రిటన్‌కు తీసుకురావడం ఇప్పుడిక సులువు కాదు. ఫ్యామిలీ వీసాకు వార్షిక ఆదాయ పరిమితిని 55 శాతానికి పెంచుతూ బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోకి వలసలను అరికట్టాలనే విధాన నిర్ణయాలలో భాగంగా ఈ నిర్ణయం అమలులోకి తీసుకువచ్చారు. వేతన లేదా ఆదాయ పరిమితి వార్షిక స్థాయి పెంపుదలతో ఇక ఫ్యామిలీవీసాకు దరఖాస్తు చేసుకునే వారి కనీస వార్షిక వేతనం ఇకపై 29000 పౌండ్లు (జిబిపి) ఉండాల్సిందే.

ఇంతకు ముందు ఇది 18,600 పౌండ్లు ఉండేది. ఫ్యామిలీ వీసా వార్షిక వేతన పరిమితిని పెంచాలని రిషి సునాక్ ప్రభుత్వం గత ఏడాదే నిర్ణయించింది. దీనిని స్కిల్డ్ వర్కర్స్ వీసాతో సమానం చేయాలని తలపెట్టారు. కాగా ఈ విషయం ఇప్పుడు ఈ నెల 11వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందని అధికార వర్గాలు తెలిపాయి. బ్రిటన్‌లో ఆదాయం స్థాయిని బట్టే ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులను దేశానికి తీసుకురావడం లేదా ఇక్కడ వారికి ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుంది. దేశంలోకి చట్టపరమైన వలసల ప్రక్రియతోనే తలెత్తుతున్న పలు సమస్యల నియంత్రణకు ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకమని వెల్లడైంది. రిషి సునాక్ ప్రభుత్వం తమ దేశంలోని టాక్స్ పేయర్స్‌కు వలసదార్ల వల్ల అదనపు భారం పడకుండా చేసేందుకు సంకల్పించిందని అధికారవర్గాలు తెలిపాయి. సామూహిక వలసలు చట్టబద్ధంగానే జరుగుతున్నాయి. దీనికి సహేతుక పరిష్కారం అవసరం. బ్రిటిషర్లందరికి ఆమోదయోగ్య నిర్ణయం తీసుకోవడానికి ఇటువంటి నిర్ణయం తప్పడం లేదని హోం మంత్రి జేమ్స్ క్లెవర్లీ తెలిపారు. కాగా వచ్చే సంవత్సరం నుంచి వార్షిక వేతన పరిమితిని 38000 పౌండ్లకు పెంచాలని కూడా ముందుగా నిర్ణయించారు.

దీనిపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం కావడంతో ఈ ప్రతిపాదనను సవరించారు. ఇక ఇప్పుడు తీసుకున్న వార్షిక వేతన పరిమితి పెంపుదలతో వలసల సంఖ్య ఏడాదికి కనీసం మూడు లక్షల వరకూ తగ్గుతాయని అధికార వర్గాలు విశ్లేషించాయి. అయితే ఈ క్రమంలో ఈ నిర్ణయ ప్రభావం ఎక్కువగా భారతదేశం నుంచి ఈ ఫ్యామిలీ వీసాలపై వచ్చే వారిపైనే పడుతుంది. బ్రిటన్ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. 2022లో ఈ ఫ్యామిలీ వీసాల ద్వారా బ్రిటన్‌లోకి చట్టబద్ధంగానే, నిబంధనల పరిధిలోనే ప్రవేశించిన వలసదార్ల సంఖ్య రికార్డు స్థాయిలో 7,45,000కు చేరారు. ఇది దేశ పౌరులకు పలు స్థాయిల్లో ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టింది. దీనితో పలు విషయాలను విశ్లేషించుకుని ఈ నిర్ణయానికి వచ్చారు.

# స్విస్‌లో ఉక్రెయిన్ శాంతి సదస్సు



న్యూఢిల్లీ : స్విట్టర్లాండ్‌లో ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు జరిగే ఉన్నత స్థాయి సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ కూడా హాజరు అయ్యే అవకాశం ఉంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం సాగుతున్న దశలో తలెత్తిన సంక్షోభ నివారణకు స్విట్జర్లాండ్ ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ సదస్సును ఏర్పాటు చేసింది. ఈ భేటీకి రష్యా, చైనాలు వెళ్లకపోవచ్చు. ఇక్కడి శాంతిసదస్సుకు ముందు ఇటలీలో జి 7 సమ్మిట్ జరుగుతుంది. దీనికి భారతదేశంతో పాటు ప్రధాన గ్లోబల్ సౌత్ దేశాలకు ఆహ్వానాలు అందాయి. స్విట్జర్లాండ్ శాంతి సదస్సు ఈ నెల 15, 16 తేదీలలో ఖరారు అయింది. అంతకు ముందు రోజు ఇటలీలో జరిగే జి 7 సమ్మిట్‌కు వచ్చే నేతలు ఈ సదస్సుకు తరలివచ్చే వీలుంది. ఈ సదస్సు ఏర్పాటు ప్రాతినిధ్యం గురించి ఇప్పటికే స్విట్జర్లాండ్ ప్రభుత్వం భారత్, బ్రెజిల్, చైనా, ఇథియోపియా, బ్రెజిల్, చైనా, అరేబియా, దక్షిణాఫ్రికా దేశాల నేతలు , ఆయాదేశాల రాయబార్లతో చర్చించింది. శాంతిస్థాపన దిశలో జరిగే ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని కోరింది. ఇప్పటికైతే సదస్సుకు హాజరీ విషయంలో చైనా, రష్యాల నుంచి ఎటువంటి స్పందన వెలువడలేదు. ఇప్పటికే రష్యా ఈ సదస్సు వల్ల ఎటువంటి ఉపయోగం లేదని విమర్శించింది.

పశ్చిమదేశాలు తమ ఉక్రెయిన్ అనుకూల వైఖరిని చాటుకునేందుకు ఇది మరో వేదిక అవుతుందని అభిప్రాయపడింది. కీవ్ పట్ల ప్రపంచ స్థాయిలో సానుకూలతను కూడగట్టేందుకు జరిగే ప్రయత్నం అని వ్యాఖ్యానించింది. ఈ పరిణామంతో ఈ కీలక సదస్సు రష్యా నుంచి ఎటువంటి ప్రాతినిధ్యంలేకుండానే సాగుతుందని వెల్లడైంది. ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ కూడా సమావేశానికి వస్తారు. చాలాకాలంగా సాగుతూ పరిస్థితిని రగిలేలా చేస్తున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారం దిశలో స్విస్ సదస్సు కీలక పరిణామం అని అంతర్జాతీయ స్థాయిలో బలీయ మద్దతు లభిస్తోంది. సంక్షోభ నివారణకు కనీసం ఈ సదస్సు నుంచి అయినా నిర్థిష్ట ప్రతిపాదనలు వెలువడితే ఆ తరువాత శాంతి ప్రక్రియకు సరైన మార్గం ఏర్పడుతుందని అంతా ఆశిస్తున్నారు.

స్విస్ సదస్సు లుజెర్న్ సిటీ సమీపంలోని అత్యంత విలాసవంతమైన బర్గెన్‌స్టాక్ రిసార్ట్ వద్ద జరుగుతుంది. ఈ సదస్సుకు స్విస్ అధ్యక్షులు వోలా అమ్‌హెర్డ్ అతిథ్యం ఇస్తున్నారు. శాంతి స్థాపన దిశలో ఇది తొలి అడుగు అని తెలిపారు. ప్రధాని మోడీ కూడా ఈ సదస్సుకు హాజరు అవుతున్న దశలో భారత విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ఈ సదస్సు పట్ల ఆశాభావం వ్యక్తం చేసింది. సంక్షోభ నివారణకు ఖచ్చితంగా ఇటువంటి చర్చలు , దౌత్యప్రక్రియ అత్యవసరం అని తాము ఆది నుంచి చెపుతూ వస్తున్నామని మంత్రిత్వశాఖ ప్రకటన వెలువరించింది.

# ధోతీ కుర్తా.. మెడలో రుద్రాక్ష

వారణాసి : ప్రముఖ పుణ్యక్షేత్రం, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కాశీ విశ్వనాథుని ఆలయం వద్ద విధులు నిర్వర్తించే పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త డ్రస్ కోడ్ విధించింది. ఇకపై ఇక్కడ సంరక్షక బాధ్యతలలో ఉండే వారు విధిగా భక్తుల సాంప్రదాయక ధోవతి, కుర్తా, ఇందులోనూ కాషాయ వస్త్రాలు ధరించాల్సి ఉంటుంది. మెడలో విధిగా రుద్రాక్ష మాలలు వేసుకోవాలి. ఇటీవల ఈ ఆలయ ప్రాంగణంలో పోలీసులు ధోతీ కుర్తా వస్త్రాలలో కలియతిరగడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు, భక్తులు కంగుతిన్నారు. దీనిపై వారణాసి నగర పోలీసు కమిషనర్ మోహిత్ అగర్వాల్ ఆదేశాలు వెలువరించారు. పోలీసులు ఇక్కడ ఇకపై సాధారణ పోలీసు ఖాకీ దుస్తులలో కాకుండా కేవలం ఈ ధోతీ కుర్తా వస్త్రధారణతోనే విధులు నిర్వర్తించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని విషయాలను , ప్రత్యేకించి ఇక్కడి పరిసరాల పవిత్రత పరిరక్షణను పరిగణనలోకి తీసుకుని ఈ డ్రస్‌కోడ్ అమలులోకి తీసుకువచ్చినట్లు అగర్వాల్ విలేకరులకు తెలిపారు. ఇక్కడికి తరలివచ్చే లక్షలాది మంది యాత్రికులను అదుపాజ్ఞలలో పెట్టేందుకు ఈ పద్ధతిని ఎంచుకున్నారని వివరించారు. ఇక్కడికి వచ్చే వారి మదిలో ప్రశాంతత క్రమంలో వీరికి ఈ డ్రస్‌కోడ్ పెట్టినట్లు తెలిపారు.



అంతటా భక్తిభావం ఏర్పడేందుకు, తమ ముందు సాధారణ భక్తుల మాదిరిగా ఉండే పోలీసులకు తమ సాధకబాధకాలు తెలియచేసుకునేందుకు ఈ విధానం ప్రవేశపెట్టామని సమర్థించుకున్నారు. ఇక్కడికి వచ్చే వారికి తమ యాత్ర పట్ల పరిపూర్ణ ప్రశాంతత ఏర్పడేందుకు, ఈ భావనతోనే తిరిగి వెళ్లేందుకు వీలేర్పడుతుందన్నారు. సాధారణంగా ఇక్కడ విధులలో ఉండే పోలీసులు దురుసుగా ఉంటారని, నెట్టివేస్తుంటారని ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు అందుతాయని , అయితే ఇప్పుడు పూజారుల మాదిరిగా కన్పించే పోలీసులు వారి పట్ల మర్యాదగా ఉంటారు. పైగా ప్రజలకు కూడా వీరికి తమ బాధలు తెలియచేసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. కేవలం కాశీ ఆలయ గర్భగుడి వెలుపలే ఈ ఏర్పాట్లు చేశారు. ఇంతవరకూ ఉన్న ఫిర్యాదుల సమస్య ఇక పరిష్కారం అవుతుందని భావిస్తున్నామని తెలిపారు. యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ తీసుకున్న నిర్ణయం పట్ల రాజకీయ విమర్శలకు దారితీసింది. ఏ పోలీసు మాన్యువల్ ప్రకారం ఇటువంటి పద్ధతికి దిగారని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. ఇటువంటి చర్యకు దిగిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కొత్త పద్ధతిని ఆసరాగా తీసుకుని ఇకపై ఎవరైనా ఈ దుస్తులలో వచ్చి పోలీసులుగా తెలియచేసుకుని లూటీలకు , మోసాలకు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారు. యోగి ప్రభుత్వం జవాబుదారి అవుతుందా? అని నిలదీశారు. రానురాను యోగి సర్కారు తీరు మితిమీరుతోంది. ఇప్పటి నిర్ణయం గర్హనీయం అని వ్యాఖ్యానించారు.

# బిజెపి వస్తే ఆపరేషన్ రాజ్యాంగ


చెన్నై : కేంద్రంలో బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చివేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. తమిళనాడులో శుక్రవారం జరిగిన పలు ఎన్నికల ప్రచార సభలలో రాహుల్ మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని తూర్పారపట్టారు. రాజ్యాంగం , దేశ మౌలిక విలువల పట్ల మోడీ ప్రభుత్వానికి గౌరవం లేదని, తిరిగి పవర్ దక్కితే ముందుగా అంబేద్కర్ విరచిత రాజ్యాంగానికి ఎసరు పెడుతారని తెలిపారు. మోడీ ప్రభుత్వానికి ఎంతసేపూ ద్రవ్య, ఆర్థిక వ్యవస్థపై గుత్తాధిపత్యం సాధించడమే ఏకైక ఆలోచన అని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చివేస్తామని బిజెపి పదేపదే చెప్పిందని ఆయన గుర్తు చేశారు. అత్యధిక మెజార్టీ దక్కితే తాము చేసేది ఇదేనని వారు చెప్పకనే చెపుతున్నారు. ఇంతకు ముందు ప్రపంచం భారతదేశాన్ని ప్రజాస్వామ్యానికి ప్రతీకగా చూసింది. ఇప్పుడు ఇక్కడి ప్రజాస్వామ్యం ఒక ప్రజాస్వామ్యమా అని అనుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకుని తీరాలని మోడీ సంకల్పించారని విమర్శించారు. ఇప్పటి ఎన్నికల నేపథ్యంలో ఇరు ప్రధాన పక్షాల నడుమ సైద్ధాంతిక పోరు ఉంది. ఓ వైపు ఆర్‌ఎస్‌ఎస్, పిఎం నరేంద్ర మోడీ ఆయన ప్రభుత్వం అనబడే సంకుచిత శక్తి ఉంది. మరో వైపు ఇవి రామస్వామి వంటి సంస్కర్తలు ప్రబోధించిన ఆచరించిన సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత సంతరించుకున్న శక్తి ఉందని, ఈ రెండింటి మధ్య పోరులో



ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాల్సిన అవసరం ఇంతకు ముందు కన్నా ఇప్పుడు ఎంతో ఎక్కువ ఉందని రాహుల్ తెలిపారు. 30 లక్షల వరకూ ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే వీటిని నిరుద్యోగ యువతికి కట్టబెట్టడం జరుగుతుందని చెప్పారు. కేంద్రంలోని మోడీ సర్కారు నిరుద్యోగ యువతను నట్టేటా ముంచిందని విమర్శించారు.

# ప్రాఫిట్ బుకింగ్.. భారీ నష్టాల్లో మార్కెట్లు

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూసింది. ఈ వారం చివరి సెషన్‌లో ప్రాఫిట్ బుకింగ్, అలాగే బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసిజి, ఫార్మా షేర్లలో అమ్మకాల కారణంగా మార్కెట్ పతనమైంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కూడా నష్టపోయాయి. మార్కెట్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 793 పాయింట్లు పతనమై 74,245 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 234 పాయింట్లు క్షీణించి 22,519 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుదల, వస్తువుల ధరల పెరుగుదల కారణంగా మార్కెట్లో ఈ క్షీణత సంభవించింది. మధ్యాహ్నానికి స్టాక్ మార్కెట్ తీవ్ర పతనం నుంచి ఏ రంగం తప్పించుకోలేకపోయింది. బ్యాంకింగ్, ఆటో, ఐటీ, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ, మెటల్స్, రియల్ ఎస్టేట్, మీడియా, ఎనర్జీ, ఇన్‌ఫ్రా, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌తో పాటు హెల్త్‌కేర్ రంగాల షేర్లు భారీ నష్టాలతో ముగిశాయి. నేటి వ్యాపారంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో క్షీణత నెలకొంది. నేటి ట్రేడింగ్‌లో 3943 షేర్లు ట్రేడ్ అవగా, 1467 షేర్లు లాభాలతో ముగియగా, 2371 షేర్లు నష్టాలతో ముగిశాయి. స్టాక్ మార్కెట్ క్షీణత కారణంగా, స్టాక్ మార్కెట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ క్షీణించింది. బిఎస్ఇ డేటా ప్రకారం, ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అయిన షేర్ల మార్కెట్ క్యాప్ గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.402.16 లక్షల కోట్లు ఉండగా, శుక్రవారం ఇది రూ.399.76 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే ఒక్క రోజులో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.40 లక్షల కోట్లు తగ్గింది. ప్రధానంగా దివీస్ ల్యాబ్ 1.09 శాతం, బజాజ్ ఆటో 0.66 శాతం, టాటా మోటార్స్ 0.49 శాతం, టిసిఎస్ 0.42 శాతం, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్ 0.36 శాతం, నెస్లే 0.34 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 0.18 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు సన్ ఫార్మా 3.99 శాతం, మారుతీ సుజుకీ 3.28 శాతం, పవర్ గ్రిడ్ 2.58 శాతం, టైటాన్ 2.48 శాతం, ఒఎన్‌జిసి 2.32 శాతం నష్టాలతో ముగిశాయి.




# సార్వత్రిక సమరానికి కౌంట్‌డౌన్!

- ఆరు రోజుల్లో వెలువడనున్న ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18 నుంచి
- నామినేషన్ల స్వీకరణ..మే 13న పోలింగ్ పోలింగ్‌కు ఒక నెల మాత్రమే
- సమయం ఉండటంతో ప్రచారంలో వేగం పెంచిన ప్రధాన పార్టీల
- అభ్యర్థులు తమదైన వ్యూహాలతో ఎన్నికలకు సన్నద్ధమైన రాజకీయ పార్టీలు

హైదరాబాద్ : తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ తేదీ సమీపిస్తోంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో నిర్వహించనుండగా తెలంగాణలో నాలుగో విడత పోలింగ్ జరగనుంది. నాలుగో విడతలో భాగంగా ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, ఆ రోజు నుంచి నా మినేషన్లపర్వం ప్రారంభం కానున్నది. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనున్నది. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు ఇసి గడువు ఇచ్చింది. మే 13వ తేదీన రాష్ట్రంలోని 17 లోకసభ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి పో లింగ్ జరగనున్నది. జూన్ 4న ఎన్నికల కౌం టింగ్ ఉంటుందని ఇసి ఇప్పటికే వెల్లడించిన వి షయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలకు ఒక నెల మాత్రమే సమయంలో ఉండటంతో ప్రధాన పా ర్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. తమదైన వ్యూహాలతో అన్ని రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ప్రచార రథాలను సిద్ధం చేసుకుని ప్రజల్లోకి విస్తృతంగా వెళుతున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలు పార్టీ ముఖ్యనాయకులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి నుంచి శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నా యి. తమ పార్టీపై ఇతర పార్టీ నేతలు చేస్తున్న విమర్శలకు ధీటుగా స్పందిస్తూనే ప్రత్యర్థి పార్టీలపై నేతలపై ఘాటు విమర్శలు చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన నేతల ఘాటైన వి మర్శలతో ఒక్కసారి రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. గ్యారంటీలను కాంగ్రెస్ ప్రచారం చేస్తుండగా, హామీల అమలు లో విఫలమయ్యారంటూ బిఆర్‌ఎస్ ఆరోపిస్తోంది. కేం ద్రంలో మళ్లీ తమదే అధికారం అనే నమ్మకంతో ఉన్న కమలం నేతలు మరోసారి మోడీ ప్రధాని ఖాయమంటూ వివరిస్తున్నారు.

### 14 స్థానాలు చేజిక్కించుకునేలా కాంగ్రెస్ అడుగులు

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలలో మెజార్టీ స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. మొత్తం 17 స్థానాలకు కనీసం 14 స్థానాలైన చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. బలమైన నాయకత్వం లేని చోట పార్టీని బలోపేతం చేసే దిశలో ఏఐసిసి అనుమతితో పక్కా కార్యాచరణ అమలు చేస్తోంది. నియోజక వర్గాల వారీగా సమీక్షలు నిర్వహి స్తూ, పార్టీ గెలుపునకు కృషి చేయాలని క్షేత్రస్థాయి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెంచే దిశలో కార్యాచరణకు శ్రీకా రం చుట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, టిపిసిసి



అధ్యక్షు లు రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు నియోజకవర్గాల వారీ గా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. లోకసభ ఎ న్నికల నియమావళి అమలులోకి రావడంతో పాలనాపరమైన అంశాలను తాత్కాలికంగా పక్కన పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

### అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా

### ముందుకెళుతున్న కమలనాథులు

కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న బిజెపి, తెలంగాణలో బిజెపికి సానుకూల వాతావరణం ఉందని భావిసన్తా ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అగ్రనేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రత్యర్థి పార్టీలపై ఘాటైన విమర్శలు చేసన్తా కమలం పార్టీ ముందుకెళుతోంది. బిజెపి పార్టీ టికెట్లు పొందిన అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాలలో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. స్థిరమైన పాలన కోసం నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చెబుతున్నారు. అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేసిన మోదీ సర్కార్‌ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రచార కార్యక్రమాల్లో స్పీడ్ పెంచిన కారు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిఆర్‌ఎస్ పార్టీ తమ ప్రచార కార్యక్రమాల్లో స్పీడు పెంచింది. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తుండగా, శనివారం(ఏప్రిల్ 13) జరిగే చేవెళ్ల బహిరంగసభ నుంచి పార్టీ అధినేత కెసిఆర్ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com